www.epaper.asthram.com

# సామాన్యుడి అస్త్రం

తెలుగు దినపత్రిక

గురువారం 8 జనవరి 2026

సంగారెడ్డి సంచిక : 180 సంపుటి : 1 పేజీలు : 8 వెల : రూ. 5/-

## తగ్గనున్న రష్యా చమురు దిగుమతులు

ఈ ఏడాది జనవరిలో రష్యా నుంచి భారత్‌కు ముడి చమురు దిగుమతులు క్షీణించే అవకాశాలు కనిపిస్తున్నాయి. దేశీయ దిగ్గజ రిలయన్స్ ఇండస్ట్రీస్ రష్యా చమురు డెలివరీలు ఉంటాయని అనుకోవట్లేదని ప్రకటన విడుదల చేయడమే ఇందుకు నేపథ్యం. దీంతో ఈ నెలలో చమురు దిగుమతులు తగ్గుతాయని భావిస్తున్నారు. ఇటీవల రిలయన్స్ సంస్థ రష్యా చమురును దిగుమతి చేసుకుంటోందని గ్లోబల్ మీడియా సంస్థ బ్లూమ్‌బర్గ్ కథనం తెలిపింది. సుమారు 22 లక్షల బ్యారెళ్ల రష్యా చమురు ఉన్న మూడు నౌకలు రిలయన్స్‌కు చెందిన జామ్‌నగర్ రిఫైనరీ వైపు వెళ్లాయని, జనవరిలో డెలివరీ అవుతాయని పేర్కొంది.


# ఫోన్ ట్యాపింగ్ కేసు.. మరో ఇద్దరికి సిట్ నోటీసులు



- సీఎం రేవంత్ రెడ్డి సోదరుడికి సిట్ నోటీసులు
- ఫోన్ ట్యాపింగ్ కేసులో సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డికి నోటీసులు
- ఉదయం సిట్ ఎదుట హాజరుకావాలని నోటీసులు
- ప్రతిపక్ష నేతగా రేవంత్‌రెడ్డి ఉన్నప్పుడు కొండల్‌రెడ్డి ఫోన్ ట్యాప్ అయినట్లు గుర్తింపు
- సిట్ కాస్తా కాంగ్రెస్ ఇన్వెస్టిగేషన్ టీమ్‌లాగా అయిపోయింది

హైదరాబాద్

ఫోన్ ట్యాపింగ్ కేసు కీలక మలుపులు తిరుగుతోంది. దర్యాప్తు ముగింపు దశకు చేరుకుంటున్న తరుణంలో ముఖ్య నేతలు తెరపైకి వస్తున్నారు. ఇప్పటి వరకు పోలీస్ అధికారులు, ప్రైవేటు వ్యక్తుల చుట్టే తిరిగిన దర్యాప్తు, తాజాగా ప్రజాప్రతినిధుల వైపు మళ్లింది. హైదరాబాద్ సీపీ సజ్జనార్ నేతృత్వంలం ఏర్పాటైన సిట్ కేసును వేగంగా దర్యాప్తు చేస్తోంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు కొండల్ రెడ్డికి సిట్ నోటీసులు ఇచ్చింది. గురువారం ఉదయం హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొంది. ప్రతిపక్ష నేతగా రేవంత్ రెడ్డి ఉన్నప్పుడు కొండల్ రెడ్డి ఫోన్ ట్యాప్ అయినట్లు గుర్తించింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో - మిగతా3లో



## రష్యా నుంచి భారత్‌కు.. రూ.15 లక్షల కోట్ల చమురు దిగుమతి

- దిగుమతి చేసుకున్న మొత్తం శిలాజ ఇంధనాల విలువ 162.5 బిలియన్ యూరోలుగా ఉంది
- ఈ మేరకు ఐరోపా సంస్థ సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్‌ఎయిర్ వెల్లడి
- యుద్ధం మొదలైన ఏడాది నుంచి ప్రపంచ దేశాలకు చమురు అమ్మడం ద్వారా రష్యా ఒక ట్రిలియన్ యూరోల ఆదాయాన్ని పొందిందని అంచనా

# ఆర్థిక భరోసాకు పెద్దపీట



- నేతన్నల జీవితాల్లో సంక్రాంతి వెలుగులు
- తెలంగాణ సర్కార్ అదిరిపోయే గుడ్ న్యూస్..
- వారికి రూ.లక్ష రుణ మాఫీ..
- అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆర్థికంగా సతమతమవుతున్న చేనేత కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం ఊహించని శుభవార్త
- ఏకంగా లక్ష రూపాయల వరకు రుణాలను మాఫీ చేస్తున్నట్లు ప్రకటన
- వేల మంది నేతన్నలకు అండగా ప్రభుత్వం

హైదరాబాద్

తెలంగాణలోని చేనేత కార్మికుల జీవితాల్లో సంక్రాంతి వెలుగులు నింపేలా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నేతన్నలు తీసుకున్న రూ.లక్ష వరకు వ్యక్తిగత రుణాలను మాఫీ చేస్తున్నట్లు హ్యాండ్లూమ్, టెక్స్టైల్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారికంగా ప్రకటించారు. అప్పుల భారం నుంచి కార్మికులను విముక్తం చేసి వారి ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడమే ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశమని మంత్రి స్పష్టం చేశారు. ఈ రుణమాఫీ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 6,784 మంది చేనేత కార్మికులు నేరుగా లబ్ధి పొందనున్నారు. 2017 నుండి 2024 వరకు పెండింగ్‌లో ఉన్న రుణాల కోసం ప్రభుత్వం రూ. 27.14 కోట్లను మంజూరు చేసింది. దీనివల్ల గత కొన్నేళ్లుగా అప్పుల ఊబిలో ఉన్న నేతన్నలకు పెద్ద ఊరట లభించినట్లయింది. కేవలం రుణమాఫీకే పరిమితం కాకుండా చేనేత రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. నేతన్నల భవిష్యత్తు అవసరాల కోసం అమలు చేస్తున్న చేనేత భరోసా, పొదుపు పథకాలకు ప్రభుత్వం ఏకంగా రూ. 303 కోట్లను కేటాయించింది. తీసుకున్న రుణాలపై వడ్డీ భారం తగ్గించేందుకు పావలా వడ్డీ పథకాన్ని - మిగతా3లో

## నాడు ఇందిరమ్మ ధైర్యం నేడు మోదీ భయం



- 'తేడా గమనించండి సార్' అంటూ రాహుల్ ఫైర్!
- ట్రంప్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఆగ్రహం
- 'సార్, ప్లీజ్ మిమ్మల్ని కలవొచ్చా' అని మోదీ అడిగారట
- పాత వీడియోతో ప్రధానిపై రాహుల్ విమర్శలు
- పన్నుల మోత, అపాచీ లేట్
- ట్రంప్ కేవలం మాటలతోనే కాదు, చేతల్లోనూ భారత్‌పై కఠినంగా ఉన్నారు



## కుక్కలు కరిచే మూడ్‌లో ఉన్నాయని ముందే ఎవరూ ఊహించలేరు

- వీధి కుక్కల వివాదంపై సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు
- అటు విద్యాసంస్థలు, ఆస్పత్రులు, రైల్వేస్టేషన్లలో కుక్కకాటు కేసులు పెరుగుతున్న నేపథ్యంలో గతేడాది నవంబర్ 7న కీలక ఆదేశాలు జారీ
- ఏ కారణం చేతనైనా మళ్లీ వాటిని పట్టుకున్న ప్రదేశంలోనే వదిలేయొద్దు

# సంక్రాంతికి టీజీఎస్ఆర్టీసీ సన్నద్ధం

- ఆర్టీసీ ప్రయాణికులకు గుడ్‌న్యూస్
- సంక్రాంతికి 1,387 స్పెషల్ బస్సులు మీ కోసం
- ప్రయాణికులకు తీపికబురు చెప్పిన టీజీఎస్ఆర్టీసీ
- ప్రయాణికుల రద్దీ ఆధారంగా అవసరమైతే సర్వీసులు పెంచటానికి సన్నాహాలు

3లో



సంక్రాంతి పండగ కోసం సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులకు టీజీఎస్ఆర్టీసీ తీపికబురు అందించింది. ఈ పండగ సమయాల్లో ప్రయాణికులను గమ్యస్థానాలను చేరవేసేందుకు ఆర్టీసీ యజమాన్యం ప్రత్యేక బస్సులను షెడ్యూల్‌ను సిద్ధం చేసింది. అలాగే సంస్థకు ఆదాయాన్ని పెంచడంతో పాటు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రత్యేక బస్సులను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇటీవల మహాలక్ష్మి పథకం కింద ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించినప్పటి నుంచి ప్రయాణీకుల సంఖ్య మరింత పెరిగింది.



## క్వార్టర్స్‌లో నెగ్గాం.. సెమీస్, ఫైనల్లోనూ మనదే గెలుపు

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు
- వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే
- యూరియా బస్తాలు దొరకడం లేదని రైతన్నలు చెబుతున్నారు
- బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో యూరియా కష్టాల్లేవ్
- ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే లైన్‌లలో చెప్పులు కనిపిస్తున్నాయి




## నెతన్యాహుకు ప్రధాని మోదీ ఫోన్

- ఉగ్రవాదంపై పోరు, ప్రాంతీయ పరిస్థితులపై చర్చలు
- ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుకు మోదీ ఫోన్ కాల్
- భారత్, ఇజ్రాయెల్ సంబంధాల గురించి చర్చలు
- నెతన్యాహు, ఇజ్రాయెల్ వాసులకు న్యూ ఇయర్ విషెస్ చెప్పిన భారత ప్రధాని

## ఎక్కడో కూర్చొని... ఉచిత సలహాలు ఇస్తుంటారు

- విదేశాంగ మంత్రి జై శంకర్ ఘాటు వ్యాఖ్యలు
- తమకు వేల మైళ్ల దూరంలో ఉన్న ఆ దేశాలు ఉద్రిక్తతల సమయంలో ఆందోళన చెందినట్లు చెప్పాయి
- కానీ అవేవీ తమ సొంత ప్రాంతంలో జరుగుతున్న వాటిని పట్టించుకోవడం లేదు



# నాడు ఇందిరమ్మ ధైర్యం- నేడు మోదీ భయం

ప్రధాని నరేంద్ర మోదీ తనను కలవడానికి "సార్, ప్లీజ్ నేను మిమ్మల్ని చూడొచ్చా?" అని బతిమాలినట్లుగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాట్లాడటంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. "తేడా గమనించండి సార్ జీ!" అంటూ మోదీని ఉద్దేశించి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. నాడు అమెరికా బెదిరింపులకు ఏమాత్రం భయపడని మాజీ ప్రధాని ఇందిరా గాంధీ ఎక్కడ? నేడు అమెరికా అధ్యక్షుడి ముందు చేతులు కట్టుకు నిల్చున్న నరేంద్ర మోదీ ఎక్కడ? అంటూ రాహుల్ ఫైర్ అయ్యారు. ఈ మేరకు ఆయన ఒక పాత వీడియోను షేర్ చేసి కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.

**ట్రంప్ ఏమన్నారంటే?**

అసలు ఈ వివాదానికి కారణం మంగళవారం ట్రంప్ చేసిన వ్యాఖ్యలే. హౌస్ జీఓపీ రిట్రీట్‌లో ట్రంప్ మాట్లాడుతూ, భారత్‌పై, మోదీపై సంచలన కామెంట్స్ చేశారు. "భారత్, రష్యా నుంచి ఆయిల్ కొంటోంది. అందుకే మేం వారిపై భారీగా పన్నులు వేశాం. ఆ పన్నుల వల్ల ప్రధాని మోదీ నాపై అంత సంతోషంగా లేరు" అని ట్రంప్ అన్నారు. అంతటితో ఆగకుండా, "మోదీ నన్ను చూడటానికి వచ్చారు. 'సార్, నేను మిమ్మల్ని కలవొచ్చా ప్లీజ్' అని అడిగారు. నేను సరే అన్నాను" అని ట్రంప్ చెప్పుకొచ్చారు. ఒక దేశ ప్రధానిని ట్రంప్ ఇలా చులకన చేసి మాట్లాడటం ప్రతిపక్షాలకు ఆగ్రహం తెప్పించింది.

**ఇందిరమ్మకు, మోదీకి తేడా ఇదే**



రాహుల్ గాంధీ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ 1971 నాటి పరిస్థితులను గుర్తుచేశారు. గతంలో తాను మాట్లాడిన ఒక వీడియో క్లిప్‌ను ఆయన పోస్ట్ చేశారు. "1971 యుద్ధ సమయంలో అమెరికా మనల్ని తీవ్రంగా బెదిరించింది. ఏకంగా తన 7వ నౌకాదళాన్ని భారత్‌పైకి పంపింది. అయినా అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ అమెరికా ఒత్తిడికి తలొగ్గలేదు. కొంచెం కూడా భయపడలేదు. కానీ ఇప్పుడు పరిస్థితి ఏంటి? ట్రంప్ ఒక్క మాట అనగానే మోదీ వణికిపోయారు. లొంగిపోయారు. ఇందిరమ్మ ధైర్యానికి, ఇప్పటి మోదీ భయానికి ఉన్న తేడా ఇదే" అని రాహుల్ ఆ వీడియోలో పేర్కొన్నారు.

**కౌగిలింతల వల్ల ఏం వచ్చింది?**

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ కూడా ప్రధానిపై సెటైర్లు వేశారు. "గతంలో 'నమస్తే ట్రంప్' అన్నారు. అమెరికా వెళ్లి 'హౌడీ మోదీ' అన్నారు. 'డొనాల్డ్ భాయ్' అంటూ బలవంతపు కౌగిలింతలు ఇచ్చారు. ఇన్ని చేసినా చివరకు మిగిలిందేంటి? ఇప్పుడు ట్రంప్ మన ప్రధానిని 'సార్, ప్లీజ్' అని అడిగించుకునే స్థాయికి దిగజార్చారు" అని ఎద్దేవా చేశారు. సోషల్ మీడియాలో గొప్పలు చెప్పుకోవడం వల్ల దేశానికి ఒరిగిందేమీ లేదని విమర్శించారు.

**పన్నుల మోత, అపాచీ లేట్**

ట్రంప్ కేవలం మాటలతోనే కాదు, చేతల్లోనూ భారత్‌పై కఠినంగా ఉన్నారు. భారత్, రష్యా ఆయిల్ కొంటున్నందుకు గాను, అమెరికా ఏకంగా 50 శాతం పన్నులు విధించింది. ఇందులో 25 శాతం పన్నులు కేవలం చమురు కొనుగోళ్ల కోసమేనని ట్రంప్ స్పష్టం చేశారు. అలాగే అపాచీ హెలికాప్టర్ల అంశాన్ని కూడా ట్రంప్ ప్రస్తావించారు. "భారత్ 68 అపాచీ హెలికాప్టర్ల కోసం ఐదేళ్లుగా ఎదురుచూస్తోందని నాకు చెప్పారు. ఇప్పుడు మేం దాన్ని మారుస్తున్నాం" అని తెలిపారు. మొత్తానికి అమెరికా అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు భారతీయ రాజకీయాల్లో కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ వార్‌ను రాజేశాయి. ప్రధాని గౌరవాన్ని ట్రంప్ తగ్గించారంటూ కాంగ్రెస్ పార్టీ తీవ్ర విమర్శలు గుప్పిస్తోంది.

# ఏనుగుల బీభత్సం- ఒక్క రాత్రిలో ఆరుగురు మృతి

ఝార్ఖండ్ పశ్చిమ సింగభూమ్ జిల్లాలో ఏనుగులు బీభత్సం సృష్టిస్తున్నాయి. రోజురోజుకు గ్రామాలపై తిరగబడుతున్న ఘటనలు ఎక్కువైపోతున్నాయి. గత ఆరు రోజుల్లోనే ఏకంగా 15 మందికి పైగా మరణించారు. తాజాగా జెటాయ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక్క రోజే ఇద్దరు చిన్నారులు సహా ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. జనవరి 6న బబారియా గ్రామంలో ఏనుగు చేసిన దాడిలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మరణించారు. ఒక కుటుంబానికి చెందిన ఐదుగురు ఇంటి బయట నిద్రపోగా రాత్రి 10 గంటల సమయంలో ఒక ఏనుగు అకస్మాత్తుగా వారి దాడి చేసింది. ఈ దాడి నుంచి ఒక చిన్నారి బయటపడగా మిగిలిన నలుగురు మరణించారు. పక్కింటి వ్యక్తి కుడా ఏనుగు దాడిలో మరణించారు. హటగమారియా ప్రాంతంలో జరిగిన మరో ఘటనలో ఒక గ్రామస్థుడు మరణించాడు. మరో ఇద్దరు గాయపడ్డారు.

ఏనుగుల దాడిపై సమాచారం అందుకున్న అటవీ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఏనుగులు సంచరించే ప్రాంతాల్లో ఉన్న గ్రామాల ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. మరణించిన కుటుంబాలకు సంతాపం తెలిపిన అధికారులు, పరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఏనుగుల దాడిలో మరణించిన వారిని బబారియా గ్రామానికి చెందిన సంతాన్ మేరాల్, అతడి భార్య జోంకో కుయి, ఇద్దరు పిల్లలుగా గుర్తించారు. మరొక వ్యక్తిని మోగ్డా లగురిగా అధికారులు గుర్తించారు.

**అటవీ శాఖ బృందాలు పెట్రోలింగ్**

ఏనుగుల దాడి ఘటనపై జిల్లా అటవీ అధికారి ఆదిత్య నారాయణ్ స్పందించారు. ఆరుబయట నిద్రపోకూడదని అనేక సార్లు అవగాహన కల్పించినా, కొందరు అలాగే పడుకుంటున్నారని అన్నారు. అందువల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని చెప్పారు. ఏనుగులు సంచరించే ప్రాంతాల్లో అటవీ శాఖ బృందాలు పెట్రోలింగ్ చేస్తున్నాయని వివరించారు. డ్రోన్లు సహా ఇతర పద్ధతుల ద్వారా ఏనుగుల కదలికలను పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. అయితే, ఏనుగులు



చాలా వేగంగా సంచరించే ప్రాంతాలను మారుస్తున్నాయని, వీటిని కనిపెట్టడమే ప్రధాన సవాల్‌గా మారిందన్నారు. ఈ క్రమంలోనే ఏనుగులను నియంత్రించేందుకు బంగాల్ నుంచి ప్రత్యేక బృందాలను పిలిపించినట్లు వివరించారు. వీరితోపాటు వంతారా వైల్‌లైఫ్ కన్జర్వేషన్ సంస్థను సంప్రదించామని చెప్పారు.

**ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి**

అంతకుముందు సోమవారం రాత్రి కూడా గోలికెరా పోలీస్ స్టేషన్ పరిధిలో ఏనుగులు దాడి చేశాయి. ఇందులో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మరణించారు. సోవా గ్రామానికి చెందిన కుంద్రా బాదా కుటుంబం ఇంటి బయట నిద్రపోతుండగా ఏనుగు దాడి చేసింది. అప్రమత్తమైన కుటుంబసభ్యులు తప్పించుకునేందుకు ప్రయత్నించగా, కుంద్రా సహా కుమార్తె కోడ్మా, కుమారుడు సాము ముగ్గురు మరణించారు. కుంద్రా భార్య మాత్రం ప్రమాదం నుంచి బయటపడింది. మరో కుమార్తె జింగి తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఏనుగుల దాడి ఘటనపై సమాచారం అందుకున్న అటవీ అధికారుల ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతుల కుటుంబానికి రూ. 20,000 తక్షణ ఆర్థిక సాయం అందించారు. ఇంకా ప్రభుత్వం తరఫున మృతుల కుటుంబాలకు పరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు. అయితే, ఏనుగులు సంచరింపు ఎక్కువ కావడం వల్ల అడవి పరిసర గ్రామాల ప్రజలు భయాందోళనలో ఉన్నారు. తమ గ్రామాలకు ఏనుగుల తాకిడి ఎక్కువ కావడంతో తమకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

# రష్యా నుంచి భారత్‌కు.. రూ.15 లక్షల కోట్ల చమురు దిగుమతి

ఉక్రెయిన్‌తో యుద్ధం మొదలైన దగ్గరి నుంచి డిస్కౌంట్ ధరకు లభిస్తోన్న రష్యా చమురును భారత్ కొనుగోలు చేస్తోన్న సంగతి తెలిసిందే అప్పటినుంచి 144 బిలియన్ యూరోల (రూ.15 లక్షల కోట్ల విలువైన) క్రూడ్ ఆయిల్‌ను దిగుమతి చేసుకుంది. దిగుమతి చేసుకున్న మొత్తం శిలాజ ఇంధనాల విలువ 162.5 బిలియన్ యూరోలుగా ఉంది. ఈ మేరకు ఐరోపా సంస్థ సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్‌ఎయిర్ వెల్లడించింది. అలాగే ఫిబ్రవరి, 2022 (యుద్ధం మొదలైన ఏడాది) నుంచి ప్రపంచ దేశాలకు చమురు అమ్మడం ద్వారా రష్యా ఒక ట్రిలియన్ యూరోల ఆదాయాన్ని పొందిందని అంచనా వేసింది. రష్యా రాయితీ ధరలకు చమురును విక్రయించడం ప్రారంభించడంతో చైనా తర్వాత మన దేశం అతిపెద్ద దిగుమతిదారుగా మారింది. ఫలితంగా మొత్తం మన చమురు దిగుమతుల్లో రష్యా వాటా 1% నుంచి




40 శాతానికి చేరింది. ఇక చైనా 210.3 బిలియన్ యూరోల చమురును కొనుగోలు చేసిందని సీఆర్ఈఏ వెల్లడించింది. గ్యాస్, బొగ్గు దిగుమతులతో కలిపి ఆ మొత్తం 293.7 బిలియన్ యూరోలుగా ఉందని తెలిపింది.

**రూ.46 వేల కోట్ల బంగారం.. స్విట్జర్లాండ్‌కు తరలించిన మదురో..!**

ఈ దిగుమతులపై అమెరికా దాని మిత్ర దేశాలు గగ్గోలు పెడుతోన్న సంగతి తెలిసిందే. ఈ కొనుగోళ్ల ద్వారా ఉక్రెయిన్‌తో యుద్ధంలో రష్యాకు భారత్ ఆర్థికంగా సహకరిస్తుందని మిత్ర దేశాలు ఆరోపించాయి. పుతిన్ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఆయిల్ ఉత్పత్తిదారులైన లుకోయిల్, రాస్‌నెఫ్ట్‌పై అమెరికా ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. భారత్‌పై నిందలు మోపిన ఐరోపా యూనియన్ దేశాలు.. ఈ నాలుగేళ్లలో రష్యా శిలాజ ఇంధనాల దిగుమతులపై 218.1 బిలియన్ యూరోలు వెచ్చించడం గమనార్హం.

# గ్రీన్‌లాండ్ స్వాధీనం.. పరిశీలనలో సైనిక ఆప్షన్: వైట్‌హౌస్

గ్రీన్‌లాండ్ అమెరికాలో భాగంగా మారాల్సిందేనని, అది తమ జాతీయ భద్రతకు అవసరమని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం పునరుద్ఘాటించింది. దానిపై నియంత్రణ సాధించేందుకు తమ వద్ద చాలా ఆప్షన్లు ఉన్నాయని, వాటిల్లో సైన్యాన్ని వాడే అంశం కూడా పరిశీలనలో ఉందని వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ పేర్కొన్నారు గ్రీన్‌ల్యాండ్ వ్యూహాత్మకంగా కీలకమైందని, ఆర్కిటిక్ ప్రాంతంలో ప్రత్యర్థులను ఎదుర్కోవడానికి దానిపై నియంత్రణ అవసరమని అధ్యక్షుడు భావిస్తున్నారన్నారు. ఆ లక్ష్యం దిశగా ముందుకువెళ్లడానికి అందుబాటులో ఉన్న అన్ని మార్గాలను పరిశీలించాలని తన బృందానికి సూచించారని చెప్పారు. వెనెజువెలా నేత నికోలస్ మదురోను సైనిక ఆపరేషన్ ద్వారా అమెరికా కస్టడీలోకి తీసుకున్న సంగతి తెలిసిందే. అప్పటినుంచి గ్రీన్‌లాండ్ పేరు వార్తల్లో వినిపిస్తోంది. ఇంకో 20 రోజుల్లో మాట్లాడదామంటూ ట్రంప్ వ్యాఖ్యలు చేయడం, గతంలో ఆయన ప్రభుత్వంలో పనిచేసిన కేటీ మిల్లర్ 'త్వరలో (గాబూచీ)' అనే పోస్టు పెట్టడం కలకలం రేపుతున్నాయి. దీంతో ఈ ద్వీపాన్ని అమెరికా (ఖూూ) తన నియంత్రణలోకి తీసుకుంటుందనే భయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ట్రంప్ వ్యాఖ్యలను ఐరోపా దేశాలు వ్యతిరేకిస్తున్నాయి. వ్యూహాత్మక, ఖనిజాలతో నిండి ఉన్న ఈ ఆర్కిటిక్ ద్వీపంపై హక్కు అక్కడి ప్రజలకే ఉంటుందని మద్దతుగా నిలిచిన




సంగతి తెలిసిందే.

## కుక్కలు కరిచే మూడ్‌లో ఉన్నాయని ముందే ఎవరూ ఊహించలేరు

వీధి కుక్కల వివాదంపై చేపట్టిన విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. కుక్కలు కరవబోతున్నాయా లేదా అనే విషయాన్నిఅవి దగ్గరకు వచ్చేంతవరకు ఎవరూ ఊహించలేరని పేర్కొంది. ఈ సమస్యకు చికిత్స కంటే నివారణే ముఖ్యమన్న అభిప్రాయం వ్యక్తం చేసింది. వీధి కుక్కలను తరలించే అంశంపై అత్యున్నత ధర్మాసనం సుమోటోగా విచారణ చేపట్టింది. అటు విద్యాసంస్థలు, ఆస్పత్రులు, రైల్వేస్టేషన్లలో కుక్కకాటు కేసులు పెరుగుతున్న నేపథ్యంలో గతేడాది నవంబర్ 7న కీలక ఆదేశాలు జారీచేసింది. బహిరంగ ప్రదేశాల నుంచి వీధి కుక్కలను షెల్టర్లకు తరలించి, వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ చేయాలని ఆదేశించింది. ఏ కారణం చేతనైనా మళ్లీ వాటిని పట్టుకున్న ప్రదేశంలోనే వదిలేయొద్దని స్పష్టంచేసింది. ఈ ప్రాంగణాల్లో కుక్కలు లేవని నిర్ధరించుకునేందుకు క్రమంతప్పకుండా తనిఖీలు చేయాలని తన ఆదేశాల్లో పేర్కొంది. జాతీయ రహదారులపై తిరుగుతున్న పశువులను కూడా షెల్టర్లకు తరలించాలని సుప్రీంకోర్టు సూచించింది.ల

## కాంగ్రెస్ తో బీజేపీ పొత్తు.. 'మహా' నేతలపై సీఎం ఫడ్నవిస్ ఆగ్రహం



మహారాష్ట్రలో మున్సిపల్ ఎన్నికలు జరుగుతున్న వేళ రాజకీయంగా కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. కొన్నిచోట్ల ప్రతిపక్షాలైన బీజేపీ, కాంగ్రెస్, ఎంఐఎం పొత్తు పెట్టుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీనిపై మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవిస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటివారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహారాష్ట్రలోని అంబర్ నాథ్ మున్సిపాలిటీలో అధికారం కోసం బీజేపీ, కాంగ్రెస్ కలిసి పని చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇక్కడ బీజేపీ, అటు కాంగ్రెస్ తోపాటు, ఎన్సీపీతో కలిసి అంబర్ నాథ్ వికాస్ అఘాఢి పేరుతో ఒక కూటమిగా ఏర్పడ్డట్లు తెలుస్తోంది. దీని ద్వారా శివసేనకు చెక్ పెట్టేందుకు ఆయా పార్టీలు ప్రయత్నిస్తున్నాయి. అలాగే అకోలా జిల్లాలోని అకోటా మున్సిపాలిటీ పరిధిలో బీజేపీ, ఎంఐఎం పొత్తు పెట్టుకున్నట్లు కూడా ప్రచారం జరుగుతోంది. దీంతో ఇలా రెండు చోట్ల బీజేపీ.. అటు కాంగ్రెస్, ఇటు ఎంఐంతో పొత్తు పెట్టుకోవడంపై శివసేన వంటి పార్టీలు విమర్శలు గుప్పిస్తున్నాయి. మున్సిపల్ సీట్లు దక్కించుకునేందుకు స్థానికంగా ప్రత్యర్థి పార్టీలతో బీజేపీ పొత్తు పెట్టుకోవడంపై మహాయుతి కూటమి నేత, రాష్ట్ర సీఎం ఫడ్నవిస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుమతి లేకుండా, పార్టీ నిబంధనలకు విరుద్ధంగా ఇలా పొత్తులు పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయంపై పూర్తి వివరాలు సేకరించేందుకు పార్టీ నేతలకు ఆదేశాలిచ్చామన్నారు. 60 సీట్లున్న అంబర్ నాథ్ లో బీజేపీ-కాంగ్రెస్-ఎన్సీపీ కూటమికివ 31 సీట్లు ఉండగా, అత్యధిక స్థానాలు (27) ఉన్న శివసేనకు అధికారం దూరమవుతుంది. దీంతో బీజేపీ తరఫున తేజశ్రీ కౌన్సిల్ ప్రెసిడెంట్ గా ఎన్నికయ్యారు. ఈ పరిణామంపై ఉద్ధవ్ ఆధ్వర్యంలోని శివసేన ఆగ్రహం వ్యక్తం చేసింది. కూటమి పొత్తు ధర్మాన్ని బీజేపీ విస్మరించి, అనైతిక చర్యలకు పాల్పడుతోందని శివసేన విమర్శించింది. మరోవైపు ఈ ప్రచారాన్ని కాంగ్రెస్ నేతలు కొట్టిపారేశారు. తమ పార్టీ కూటమిలో లేదని కాంగ్రెస్ నేతలు అంటున్నారు.

## నెతన్యాహుకు ప్రధాని మోదీ ఫోన్



ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహుతో భారత ప్రధాని నరేంద్ర మోదీ ఫోన్‌లో మాట్లాడారు. ఈ క్రమంలో నెతన్యాహు, ఇజ్రాయెల్ దేశ ప్రజలకు ప్రధాని మోదీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి ఇద్దరు నాయకులు కూడా తమ నిబద్ధతను పునరుద్ఘాటించారు. ఈ విషయాన్ని ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. "నా స్నేహితుడు, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో ఫోన్‌లో మాట్లాడాను. ఆయనకు, ఇజ్రాయెల్ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయడం సంతోషంగా ఉంది. రాబోయే కాలంలో భారత్-ఇజ్రాయెల్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడం గురించి మేము చర్చించాం. ప్రాంతీయ పరిస్థితులపై పరస్పరం అభిప్రాయాలను పంచుకున్నాం. ఉగ్రవాదాన్ని మరింత దృఢ సంకల్పంతో ఎదుర్కోవాలనే మా ఉమ్మడి సంకల్పాన్ని పునరుద్ఘాటించాం." అని మోదీ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.

## ఎక్కడో కూర్చొని... ఉచిత సలహాలు ఇస్తుంటారు



పాకిస్థాన్ ఉగ్ర దాడులకు ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన సమయంలో పశ్చిమ దేశాలు కపటత్వం ప్రదర్శించడంపై విదేశాంగ మంత్రి జై శంకర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు తమకు వేల మైళ్ల దూరంలో ఉన్న ఆ దేశాలు ఉద్రిక్తతల సమయంలో ఆందోళన చెందినట్లు చెప్పాయని.. కానీ అవేవీ తమ సొంత ప్రాంతంలో జరుగుతున్న వాటిని పట్టించుకోవడం లేదని విమర్శించారు. లక్సెంబర్గ్‌లోని భారత కమ్యూనిటీ సభ్యులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సాయం చేయాలనుకునే వారితో కలిసి పని చేసేందుకు భారత్ సిద్ధంగా ఉంటుందని జైశంకర్ పేర్కొన్నారు. అదే.. పాకిస్థాన్‌లా ప్రవర్తిస్తే మాత్రం వాటికి అలాగే సమాధానం చెబుతామని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలోని ఇతర ప్రాంతాల్లో జరిగే పరిణామాలు దేనిని ఏమేరకు ప్రభావితం చేస్తాయో చెప్పడం కష్టమన్నారు. ఆలోచన లేకుండా ఎక్కడో దూరంగా కూర్చొన్నవారు.. ఉచిత సలహాలు ఇస్తున్నారని, అవి కొన్నిసార్లు స్వార్థంగా, నిర్లక్ష్యంగా ఉంటున్నాయన్నారు. ప్రస్తుతం చాలా దేశాలు తమ స్వార్థం కోసం మాత్రమే పని చేస్తున్నాయన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఎలా వ్యవహరించాలనే దానిపై పలు దేశాలు భారత్‌కు సలహాలు ఇచ్చాయన్నారు. కానీ అవేవీ పట్టించుకోకుండా దేశ భద్రత కోసం భారత్ ముందుకుసాగిందన్నారు.

# సంక్రాంతికి టీజీఎస్ఆర్టీసీ సన్నద్ధం

**హైదరాబాద్:** సంక్రాంతి నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లే వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీజీఎస్ఆర్టీసీ) పూర్తి స్థాయిలో సన్నద్ధమైంది. ఈ ఏడాది సంక్రాంతికి పండుగకు 6431 ప్రత్యేక బస్సులను నడపాలని యాజమాన్యం ఇప్పటికే నిర్ణయించింది. ప్రధానంగా ఈ నెల 9, 10, 12, 13 తేదీల్లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఆయా రోజుల్లో రద్దీ మేరకు ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచేలా ప్లాన్ చేసింది. అలాగే, ఈ నెల 18, 19 తేదీల్లో తిరుగు ప్రయాణ రద్దీకి సంబంధించి తగిన ఏర్పాట్లు చేసింది. హైదరాబాద్‌లో రద్దీ ప్రాంతాలైన ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్ క్రాస్ రోడ్స్, ఆరాంఘర్, ఎల్బీనగర్ క్రాస్ రోడ్స్, కేపీహెచ్బీ, బోయిన్పల్లి, గచ్చిబౌలి తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను సంస్థ నడుపుతోంది. ఆయా ప్రాంతాల్లో ప్రయాణికుల సౌకర్యార్థం పండల్స్, షామియానాలు, కుర్చీలు, పబ్లిక్ అడ్రస్ సిస్టం, తాగునీటి సదుపాయం, మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేయనుంది.

### 2003లో జీవో ప్రకారం ఛార్జీల పెంపు..

ప్రధాన పండుగులు, ప్రత్యేక సందర్భాల్లో ప్రజలకు రవాణా పరంగా ఇబ్బందులు తలెత్తకుండా వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు స్పెషల్ సర్వీసులను ఆర్టీసీ యాజమాన్యం నడుపుతోంది. తిరుగు ప్రయాణంలో స్పెషల్ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ ఏమాత్రం లేనప్పటికీ రద్దీ ఉన్న రూట్లలో ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఖాళీ బస్సులను త్వరతగతిన సంస్థ వెనక్కి తెప్పిస్తుంది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా వాటిని ఆయా రూట్లలో నడిపిస్తుంది. ఆ స్పెషల్ బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చులు, నిర్వహణ మేరకు టికెట్ ధరను సవరించుకోవాలని 2003లో జీవో నంబర్ 16ను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో నడిచే స్పెషల్ బస్సుల్లో మాత్రమే 1.5 రేట్ల వరకు టికెట్ ధరలను సవరించుకునే వెసులుబాటును సంస్థకు ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం ప్రతి ప్రధాన పండుగకు 1.5 రేట్ల వరకు టికెట్ ధరలను ఉమ్మడి కార్పొరేషన్‌గా ఉన్నప్పటి నుండి అమలు చేస్తుంది. టీజిఎస్ఆర్టీసీ ఏర్పడిన నాటి నుండి ప్రతి ప్రధాన పండుగకు దీన్ని అమలు చేస్తుంది.

### ఆ బస్సుల్లో ఉచిత ప్రయాణం..

ఈ సంక్రాంతి పండుగకు నడిపే ప్రత్యేక బస్సులకు రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం 1.5 రేట్లు వరకు టికెట్ ధరలను టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం సవరించింది. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలకు తిరిగే స్పెషల్ బస్సులకు మాత్రమే సవరించిన చార్జీలు వర్తిస్తాయి. ఈ నెల 9, 10, 12,13 తేదీలతో పాటు తిరుగు ప్రయాణ రద్దీ ఎక్కువగా ఉండే 18, 19 తేదీల్లో మాత్రమే సవరించిన చార్జీలు అమల్లో ఉంటాయి. స్పెషల్ బస్సులు మినహా రెగ్యులర్ బస్సుల్లో సాధారణ చార్జీలే అమల్లో ఉంటాయి. రాష్ట్ర ప్రభుత్వ మహాలక్ష్మి పథకంలో భాగంగా సంక్రాంతికి నడిపే పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్, సిటీ ఆర్డినరి, మెట్రో ఎక్స్ ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు రవాణా సదుపాయం యథావిధిగా అమల్లో ఉంటుంది. టీజీఎస్ఆర్టీసీ బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్‌ను ఝఝ.్రంతీఎబం.అఅ వెబ్ సైట్‌లో బుక్ చేసుకోవాలని యాజమాన్యం తెలిపింది. సంక్రాంతి ప్రత్యేక బస్సులకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033 లలో సంప్రదించాలని సూచించింది.

### 601 సర్వీసులకు రిజర్వేషన్ సౌకర్యం

సాధారణ బస్సులు రెగ్యులర్ ఛార్జీలే వసూలు చేస్తారు. అయితే కొన్ని ప్రత్యేక బస్సుల్లో అదనపు ఛార్జీలు ఉండొచ్చు. ఇక ప్రైవేట్ ట్రావెల్స్ మాత్రం ఈ పండగ వేళలో ఛార్జీలు రెండింతలు చేస్తారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం యథావిధిగా కొనసాగుతుంది. ప్రయాణికులు రద్దీని దృష్టి పెట్టుకుని దాదాపు 601 సర్వీసులకు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం ఉంది. దీని ద్వారా ప్రయాణికులకు సీటు గ్యారెంటీపై ఆర్టీసీ భరోసా కల్పించింది. రిజర్వేషన్ టికెట్ల బుకింగ్ కోసం అధికారిక వెబ్‌సైట్‌లను సంప్రదించాలని సూచిస్తున్నారు.

### ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు

పండక్కి వెళ్తున్నారు? బాగానే ఉంది. మరి తిరుగు ప్రయాణం సంగతేంటి? అందుకు భయమే అవసరం లేదు. పండగ తర్వాత ప్రయాణానికి సైతం ప్రయాణికుల సౌలభ్యం కోసం జనవరి 16 నుంచి 20 వరకు 569 సర్వీసులను ఏర్పాటు చేశారు. రిజర్వేషన్ బస్సులు 236, సాధారణ బస్సులు 333 ఉన్నాయి. ఇందులో గరిష్ఠ రద్దీ రోజులుగా అంచనా వేస్తూ 11,12,13 తేదీల్లో హైదరాబాద్ నుంచి ఖమ్మం రీజియన్‌కు ఒక్కోరోజు 156 బస్సుల చొప్పున నడపనున్నారు. తిరుగు ప్రయాణంలో 18వ తేదీన అత్యధికంగా 173 బస్సుల అందుబాటులో ఉంచాలని నిర్ణయించారు.

### హైదరాబాద్ నుంచి ఖమ్మం రీజియన్‌కు

జనవరి 9 నుంచి 15 వరకు ప్రత్యేక బస్సుల అందుబాటులో ఉంటాయి. మొత్తం 818 సర్వీసులు నడపాలని అధికారులు షెడ్యూల్ ని రూపొందించారు. వీటిలో 365 సర్వీసులకు రిజర్వేషన్ సదుపాయం కల్పించారు. మిలిగిన 453 సాధారణ సర్వీసులను ఏర్పాటు చేశారు.

### సంక్రాంతికి రైళ్లు సర్వీసులు ఇలా

ఈ సంక్రాంతి నేపథ్యంలో రైల్వే ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని దక్షిణ మధ్య రైల్వే అధికారులు అదనపు ప్రత్యేక రైళ్లను కేటాయించారు. ఖమ్మం రైల్వేస్టేషన్ మీదుగా 11 ప్రత్యేక సర్వీసులను నడపనున్నారని రైల్వే చీఫ్ కమిర్షియల్ ఇన్‌స్పెక్టర్ డి.రాజగోపాల్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రారంభమై ఈ నెల 25వ తేదీ వరకు నడుస్తాయన్నారు. ఇప్పటికే ఈ రైళ్లకు సంబంధించి టికెట్ రిజర్వేషన్లు ప్రారంభించారని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు రైల్వేస్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.

# కార్నర్‌లో కార్...

**హైదరాబాద్ :** నిన్నమొన్నటి వరకు ఆమె టార్గెట్ హరీశ్‌రావు. అప్పుడప్పుడు కేటీఆర్‌పై అటాక్. మధ్యలో సంతోష్‌పై సెటైర్లు. కానీ ఇప్పుడు అక్క..డైరెక్ట్‌గా గులాబీ బాస్‌పైనే బాణాలు ఎక్కుపెడుతోంది. పెద్ద సార్ టార్గెట్‌గానే..ఇంకా చెప్పాలంటే కల్వకుంట్ల ఫ్యామిలీ లక్ష్యంగానే ఆమె రాజకీయ పోరాటం ఉండబోతుందన్నది చెప్పకనే చెప్పేస్తోంది. కానీ కవిత కామెంట్స్‌పై కల్వకుంట్ల ఫ్యామిలీ నుంచి మాత్రం నో రియాక్షన్. కవిత రోజు రోజుకు డోస్ పెంచుతున్నా బీఆర్ఎస్ కీలక నేతలెవరూ స్పందించడం లేదు. ఇదే ఇప్పుడు కారు పార్టీలో హాట్ టాపిక్‌గా మారుతోంది.కారులో ఉన్నప్పుడే అందరినీ కార్నర్ చేసింది. ఒక్క అధినేతను వదిలిపెట్టి.. హరీశ్, కేటీఆర్, సంతోష్‌ను..వరుసపెట్టి అటాక్ చేస్తూ వచ్చింది కవిత. ఇక బీఆర్ఎస్‌కు, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశాక..ఆమె విమర్శల దాడి ఇంకా ఎక్కువైంది. ఎక్కడికెళ్లినా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులే టార్గెట్‌గా ఆరోపణలు చేస్తూ వస్తున్నారు కవిత.అయినా హరీశ్, కేటీఆర్ సహా బీఆర్ఎస్ ముఖ్యనేతలెవరూ ఆమె కామెంట్స్‌పై అస్సలు రియాక్ట్ కావడం లేదు. లేటెస్ట్ మండలి వేదికగా కవిత మాట్లాడిన తీరు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పటివరకు హరీష్ రావు, కేటీఆర్‌తో పాటు బీఆర్ఎస్ ముఖ్యనేతలందరిపైనా విమర్శలు చేస్తూ వస్తున్న కవిత ఇప్పుడు మరింత స్పీడ్ పెంచారు. మొన్నటివరకు కేసీఆర్ దేవుడని, తన హీరో అని చెప్పిన కవిత..ఇప్పుడు ఆయనపైన ఇండైరెక్ట్ అటాక్ చేయడం చర్చకు దారితీస్తోంది.బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పేరు నేరుగా తీసుకోకపోయినా ఆయనపై విమర్శలు చేశారు కవిత. శాసనమండలి సాక్షిగా కేసీఆర్ తొమ్మిదిన్నరేళ్ల పాలనపై సంచలన ఆరోపణలు చేశారు. బీఆర్ఎస్ పాలన అంతా అవినీతిమయం అంటూ పరోక్షంగా కేసీఆర్‌ను కార్నర్ చేసే ప్రయత్నం చేశారు కవిత. తెలంగాణను ఏం ఉద్ధరించామని టీఆర్ఎస్ పార్టీని బీఆర్ఎస్‌గా మార్చి జాతీయ రాజకీయాలకు వెళ్లారంటూ మండలిలో ఉచ్చరించకూడని భాషతో తండ్రి కేసీఆర్‌ను ప్రశ్నించారామె.కేసీఆర్‌తో సహా బీఆర్ఎస్ పార్టీ, పాలనపై కవిత చేసిన వ్యాఖ్యలు, ఆరోపణలు, విమర్శలు ఇప్పుడు రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ముందు హరీశ్‌రావు, తర్వాత కేటీఆర్, ఇప్పుడు నేరుగా అధినేత కేసీఆర్‌ను అంటే మొత్తం కేసీఆర్ ఫ్యామిలీనే కవిత టార్గెట్ చేస్తున్నా..వాళ్లేవరు ఆమె కామెంట్స్‌పై ఎందుకు స్పందించడం




లేదన్నది బీఆర్ఎస్ వర్గాల నుంచి ఎదురవుతున్న ప్రశ్న.కవిత వ్యాఖ్యలు, ఆమె చేసిన ఆరోపణలు బీఆర్ఎస్ పార్టీకి ఎంతో కొంత నష్టాన్ని కలిగిస్తాయని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారట. ఆమె శాసన మండలిలో కన్నీళ్లు పెట్టుకుని మరీ అధినేత కేసీఆర్ సహా పార్టీపై, తొమ్మిదిన్నరేళ్ల పాలనపై ఆరోపణలు చేయడంపై గులాబీ లీడర్లు ఆందోళన చెందుతున్నారట. కవిత ఇంతలా సీరియస్ కామెంట్స్ చేసినా..అడ్డగోలు ఆరోపణలు చేస్తున్నా కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు ఎందుకు రియాక్ట్ కావడం లేదన్నది బీఆర్ఎస్ నేతలకు, క్యాడర్‌కు అంతుచిక్కడం లేదట.కవిత వ్యాఖ్యలపై పార్టీ నుంచి ఎంత మంది మాట్లాడినా ఆ ముగ్గురిలో ఎవరో ఒకరు స్పందిస్తే ఎఫెక్ట్ వేరేగా ఉంటుందని చర్చించుకుంటున్నారట. లేకపోతే బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు అయోమయానికి గురయ్యే ప్రమాదం ఉందంటున్నారు. ఇదే సమయంలో కవిత ఆరోపణలను అధినేత కేసీఆర్ కాకపోయినా కనీసం కేటీఆర్, హరీశ్‌రావు ఖండించకపోతే పార్టీకి నష్టం జరగడంతో పాటు ప్రత్యర్థి రాజకీయ పార్టీలకు అస్త్రాలుగా మారతాయన్న ఆందోళన వ్యక్తమవుతోందటపార్టీ మహిళా నేతలతో కవితకు కౌంటర్ ఇప్పించినా అది ప్రజల్లోకి వెళ్లదని, కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుపై ఆమె ఆరోపణలు చేస్తున్నారు కాబట్టి వాళ్లు సమాధానం చెప్తేనే బాగుంటుందన్న ఒపీనియన్స్ వస్తున్నాయట. అయితే కవిత అంతలా ఫ్యామిలీ మెంబర్స్‌ను టార్గెట్ చేస్తున్నా వాళ్లు మౌనంగా ఉండటం వెనుక ఆంతర్యం వేరే ఉందన్న టాక్ వినిపిస్తోంది. కవిత ఎంత కాదనుకున్నా తమ కుటుంబ సభ్యురాలేనని, అధినేత కేసీఆర్ కూతురు కాబట్టి..ఆమె ఎన్ని ఆరోపణలు చేసినా కేటీఆర్, హరీశ్‌రావు మౌనంగా ఉండాల్సి వస్తోందట.కవిత ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీలో లేకున్నా తమ ఫ్యామిలీ మెంబరే కావడంతో ఆమెపై తాము మాట్లాడటం సరికాదని భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే కవిత ఇలా అధినేత కేసీఆర్‌పైనా తీవ్ర ఆరోపణలు చేస్తున్నా మౌనంగా ఉంటే బీఆర్ఎస్ పార్టీ క్యాడర్‌తో పాటు జనంలోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. రాబోయే రోజుల్లో కవిత దూకుడు ఎలా ఉంటుందో..బీఆర్ఎస్ రియాక్షన్ ఇంకెలా ఉంటుందో వేచి చూడాలి.

## ఎన్నికలకు సిద్ధమవుతున్న పురపాలికలు

**రంగారెడ్డి :** మేడ్చల్ జిల్లాలో మున్సిపాలిటీలలో ఎన్నికల కొలాహలం మొదలైంది. జిల్లాలో ఎన్నికలు జరుగుతాయా లేదా అనే అనుమానాలు ఉన్నప్పటికీ అధికారులు ఎన్నికల నిర్వహణకు కసరత్తు చేస్తుండడంతో ఆశావహులు సైతం సిద్ధమవుతున్నారు. జిల్లాలో కేవలం మూడు మున్సిపాలిటీలు మాత్రమే ఉన్నాయి. ఇవి కూడా ప్రత్యేక పరిస్థితుల్లో ఇటీవల ఏర్పడ్డాయి.గతంలో జిల్లాలో నాలుగు మున్సిపల్ కార్పొరేషన్ లు, 9 మున్సిపాలిటీలో ఉండేవి. ఇవి రింగురోడ్డు లోపల, రింగ్ రోడ్డు ని ఆనుకొని ఉండడంతో ప్రభుత్వం ఇటీవల జిహెచ్ఎంసిలో విలీనం చేసింది. అంతకుముందు జిల్లాలోని గ్రామపంచాయతీలన్నీ మున్సిపాలిటీలలో విలీనం చేసింది. రింగ్ రోడ్డు బయట ఉన్న గ్రామాలను కలిపి ఎల్లంపేట, అలియాబాద్, మూడు చింతలపల్లి మున్సిపాలిటీలు ఏర్పాటు చేసింది. జిల్లాలో మూడు మున్సిపాలిటీలు మాత్రమే ఉన్నందున ఇవి కూడా జిహెచ్ఎంసి లో కలుస్తాయనే ప్రచారం జరుగుతున్నప్పటికీ అధికార యంత్రాంగం ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తుండడంతో పోటీకి సిద్ధమవుతున్నారు. మున్సిపల్ ఎన్నికలకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. మూడు మున్సిపాలిటీలలో ఓటరు జాబితా ముసాయిదాలు వెల్లడించారు. ఓటరు జాబితా పై ఈ నెల 5 వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరించి అదే రోజు రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో అభ్యంతరాలు, సలహాలు, సూచనలు తీసుకున్నారు. ఈనెల 10వ తేదీన ఓటరు తుది జాబితా విడుదల చేయనున్నారు. మున్సిపల్ ఎన్నికలలో ఆశావహులు పోటీకి సిద్ధమవుతున్నారు. మున్సిపల్ ఎన్నికలు పార్టీల గుర్తులతో జరుగుతాయి. పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థులకు బీఫామ్ అవసరం. దీంతో ఆయా పార్టీల నియోజకవర్గ బాధ్యులను కలిసి తమ అంతరంగాన్ని వెల్లడిస్తున్నారు. ఈ మూడు మున్సిపాలిటీలు మేడ్చల్ నియోజకవర్గంలోనే ఉన్నాయి. ఎల్లంపేట, మూడు చింతలపల్లి లలో 24 వార్డులు చొప్పున, అలియాబాద్ మున్సిపాలిటీలో 20 వార్డులు ఉన్నాయి.పోటీ చేయాలనుకునేవారు గ్రౌండ్ వరకు కూడా చేసుకుంటున్నారు. పార్టీల నాయకులు సైతం కార్యకర్తల సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలో కార్యకర్తల సమావేశాన్ని మంగళవారం డిసిసి అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్, సీనియర్ నాయకులు హరి వర్ధన్ రెడ్డి, నక్క ప్రభాకర్ గౌడ్ నిర్వహించారు. వీరు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఐదు రోజుల క్రితం ఎంపీ ఈటెల రాజేందర్ బిజెపి కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి అందరూ ఐక్యంగా ఉండి పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని సూచించారు. మున్సిపాలిటీలలో రిజర్వేషన్లపై ఉత్కంఠ ఏర్పడింది. ఈ మూడు కొత్త మున్సిపాలిటీలలో చైర్మన్ పదవి, వార్డ్ మెంబర్ పదవులు ఏ కేటాగిరికి రిజర్వేషన్ అవుతుందనే విషయంలో ఆశావాహులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. రిజర్వేషన్ సస్పెన్స్ ఉన్నప్పటికీ ఆశావహులు పోటీకి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. రిజర్వేషన్ అనుకూలంగా వస్తే పోటీ చేయాలని భావిస్తున్నారు. ఈ నెలలో మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదలవుతుందని భావిస్తున్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసు.. మరో ఇద్దరికి సిట్ నోటీసులు

-మొదటిపేజీ తరువాయి

మరికొందరికి సిట్ నోటీసులు ఇచ్చింది. బీఆర్ఎస్ నేతలకు నోటీసులు – మరో చార్జిషీట్ దాఖలు చేసేందుకు సిద్ధం

ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణలో సిట్ దూకుడు పెంచింది. తాజాగా విచారణకు హాజరుకావాలని ఎమ్మెల్సీ నవీన్ కుమార్ తండ్రి కొండలరావుకు సిట్ నోటీసులు జారీ చేసింది. అతనితో పాటు కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కుమారుడు సందీప్ రావుకు సైతం నోటీసులు జారీ చేసింది. నేడు విచారణకు హాజరు కావల్సి ఉండగా నవీన్ రావు తండ్రి కొండలరావు గైర్హాజరయ్యారు. అనారోగ్య కారణాల దృష్ట్యా తన నివాసంలోనే విచారణకు సిద్ధమని సిట్ అధికారులకు తెలిపారు. ఎమ్మెల్యే మాధవరం కుమారుడు సందీప్ రావు విదేశాల్లో ఉన్నట్లు సిట్‌కి తెలిపినట్లు తెలుస్తోంది. వీరితో పాటు మరో ఇద్దరు బీఆర్ఎస్ నేతలకు కూడా సిట్ నోటీసులు ఇచ్చింది. కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యలకు నోటీసులు ఇచ్చింది. రేపు ఉదయం 11 గంటలకు విచారణకు హాజరుకావాలని నోటీసులు ఇచ్చింది. త్వరలో మరో చార్జిషీట్ దాఖలు చేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

### నవీన్ రావు ఇచ్చిన సమాచారం ఆధారంగా

ఈ కేసు దర్యాప్తులో భాగంగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్ రావును జనవరి 4న సిట్ సుదీర్ఘంగా ప్రశ్నించింది. గులాబీ పార్టీ పెద్దలతో ఉన్న ఆర్థిక సంబంధాలపైనా ఆరా తీసింది. దాదాపు 9 గంటల పాటు సాగిన విచారణలో గతంలో బీఆర్ఎస్ పార్టీకి సమకూరిన ఎలక్టోరల్ బాండ్ల అంశంపైనా ప్రశ్నించినట్లు తెలుస్తోంది.

### గతంలో అడిగిన విషయాలనే మరోసారి

ఆయనకు నోటీస్ ఇచ్చి 2024 సెప్టెంబర్ 24న వాంగ్మూలం నమోదు చేశారు. తాజాగా మరోసారి ఆయన్ని విచారించడం ప్రాధాన్యం సంతరించుకొంది. అప్పటి విచారణలో సరైన సమాచారం లభించలేదనే భావనతోనే సిట్ మరోసారి నవీన్ రావు వాంగ్మూలం నమోదు చేసినట్లు తెలిసింది. గతంలో అడిగిన విషయాలనే మరోసారి సిట్ అధికారులు అడిగారని ఎమ్మెల్సీ నవీన్ రావు తెలిపారు. బయట ప్రచారం జరుగుతున్నట్లు తానే ట్యాపింగ్ పరికరాలను సమకూర్చాననే విషయంలో ఎలాంటి ప్రశ్నలు అడగలేదని, అలాంటి ప్రస్తావనే రాలేదని స్పష్టం చేశారు.

### సిట్ కాస్తా కాంగ్రెస్ ఇన్వెస్టిగేషన్ టీమ్‌లాగా అయిపోయింది

ఫోన్ ట్యాపింగ్ కేసును ఇంకా ఎన్నాళ్లు సాగదీస్తారని ఎంపీ రఘునందన్‌రావు ప్రశ్నించారు. ఎంతమందిని పిలిచి విచారణ చేసినా వేళ్లన్నీ ఒకవైపే చూపిస్తున్నాయని, వేళ్లన్నీ ఒకరివైపే చూపినా ఆయన జోలికి వెళ్లటం లేదని అన్నారు. ఇంటి అల్లుడి ఫోన్ ట్యాప్ చేస్తారా అని స్వయంగా కుమార్తె ప్రశ్నించిందని తెలిపారు. సిట్ కాస్తా కాంగ్రెస్ ఇన్వెస్టిగేషన్ టీమ్‌లాగా అయిపోయిందని విమర్శించారు. 650 మంది ఫోన్లు ట్యాప్ అయ్యాయని సర్వీస్ ప్రొవైడర్లే చెప్పారని అన్నారు. కుటుంబంలో ఏమైనా సమస్యలుంటే పరిష్కరించుకుంటామని, బీఆర్ఎస్ పార్టీ ప్రజలకు భారమైందిఆ పార్టీతో ఉపయోగం లేదని రఘునందన్‌రావు ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పార్టీ ప్రస్తుతం ఆ కుటుంబ సభ్యులకే నచ్చటం లేదని, కాంగ్రెస్ పార్టీపై ప్రజలు నమ్మకం కోల్పోయారని అన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది బీజేపీయే అని ధీమా వ్యక్తం చేశారు.

## క్వార్టర్స్‌లో నెగ్గాం.. సెమీస్, ఫైనల్లోనూ మనదే గెలుపు

**ఖమ్మం:** ఎగవేతలు, కూల్చివేతలతో కాంగ్రెస్ పాలన కొనసాగుతోందని.. అందుకే ఆ పార్టీని తరిమి కొట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. ఖమ్మంలో బుధవారం నిర్వహించిన నూతన సర్పంచ్‌ల అభినందన సభలో ఆయన మాట్లాడుతూ.. రేవంత్ సర్కార్‌పై ధ్వజమెత్తారు. క్వార్టర్ ఫైనల్‌లో(సర్పంచ్ ఎన్నికలను ఉద్దేశించి..) మంచి ఫలితాలు వచ్చాయి. సెమీ ఫైనల్ లో మంచి ఫలితాలు వస్తాయి. చివరికి ఫైనల్ లో విజయం మనదే. వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే. యూరియా బస్తాలు దొరకడం లేదని రైతన్నలు చెబుతున్నారు. పాలిచ్చే గేదెను వదులుకొని.. తన్నే దున్నపోతు ను గెలిపించారని నేను వారితో చెప్పా. అయిపోయింది ఏదో అయిపోయింది.. వచ్చేది బీఆర్ఎస్ అని రైతులు నాతో చెప్పారు. రైతులు ఎంత క్లారిటీగా ఉన్నారో అర్థమైంది. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో యూరియా కష్టాల్లేవ్. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే లైన్‌లలో చెప్పులు కనిపిస్తున్నాయి. షాపుల్లో లేని యూరియా యాప్‌ల్లో ఎలా వస్తుంది?.. కాంగ్రెస్ పాలనలో ఎగవేతలు, కూల్చివేతలు. లక్ష కోట్ల బడ్జెట్ అన్నారు.. ఏమైంది?. కౌలు రైతులకు ఇస్తామన్న డబ్బులు ఇచ్చారా?. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇచ్చారా?. రెండేళ్లలో ఏం అభివృద్ధి జరిగింది?.. కూల్చివేతలు, ఎగవేతలే కనిపిస్తున్నాయి. ఇది సర్వభ్రష్ట ప్రభుత్వం..

ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయాలని కేసీఆర్ పని చేశారు. ఇప్పుడు ఇదే జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు ఉన్నారు. కనీసం రైతులకు యూరియా ఇప్పించలేని పరిస్థితిలో ఉన్నారు. కమీషన్ల కోసమే ఆ మగ్గురు పని చేసేది. 30 శాతం ట్యాక్స్ నడిపిస్తున్నారు వాళ్లు. ఆరు గ్యారెంటీలు భద్రంగా పెట్టుకొండనీ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆనాడు ఎన్నికల ప్రచారం లో చెప్పారు. ఇప్పుడు రెండేళ్లు అయిన గ్యారెంటీలు అమలు కాలేదు. దీనికి భట్టి ఏమి సమాధానం చెబుతారు?.. ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ ఓటమికి రంగం సిద్ధమైంది. సర్పంచ్ ఎన్నికల్లో 40 శాతం పదవులు గెలుచుకున్నాం. ఇక్కడే రెండేళ్లలోనే ప్రభుత్వంపై ఎంత వ్యతిరేకత వచ్చిందో తెలుస్తోంది. త్వరలో జగరబోయే కార్పొరేషన్, మున్సిపల్ ఎన్నికల్లో ఓటమి తప్పదు. ఖమ్మం నుంచి 7 నుంచి 8 స్థానాలు గెలుస్తాం అని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

## ఆర్థిక భరోసాకు పెద్దపీట


-మొదటిపేజీ తరువాయి

సమర్థవంతంగా అమలు చేస్తోంది. ఇందిరమ్మ చీరల పథకం వంటి కార్యక్రమాల ద్వారా నిరంతర పని కల్పిస్తోంది.

### టెస్కో ద్వారా భారీ కొనుగోళ్లు

చేనేత కార్మికులకు మార్కెటింగ్ ఇబ్బందులు లేకుండా ఉండేందుకు టెస్కో ద్వారా ప్రభుత్వం నేరుగా వస్త్రాలను కొనుగోలు చేస్తోంది. ఇప్పటివరకు సుమారు రూ.587 కోట్ల విలువైన వస్త్రాలను కొనుగోలు చేసినట్లు మంత్రి తుమ్మల తెలిపారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా కార్మికులకు నేరుగా ఆదాయం అందేలా ప్రభుత్వం అడుగడుగునా చర్యలు తీసుకుంటోందని ఆయన చెప్పారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై రాష్ట్రవ్యాప్తంగా చేనేత సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. నేతన్నల సంక్షేమమే తమ ప్రాధాన్యతని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పునరుద్ఘాటించారు.

## కొత్త పార్టీ వచ్చినా మనుగడ కష్టం
## మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



**హైదరాబాద్:** కవిత వచ్చి విజ్ఞప్తి చేయడంతోనే ఆమె రాజీనామాను ఆమోదించినట్లు తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తెలిపారు. భావోద్వేగంతో రాజీనామా చేసినప్పుడు కొంతకాలం వేచిచూస్తామని.. ఆమె విషయంలోనూ అదే జరిగిందన్నారు. హైదరాబాద్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. కవిత కొత్త పార్టీ ప్రకటనపైనా గుత్తా స్పందించారు. "రాష్ట్రంలో కొత్తగా పార్టీలు పెట్టాల్సినంత అవసరం లేదు. కొత్త పార్టీ వచ్చినా మనుగడ కష్టం. గతంలో వచ్చిన పలు రాజకీయ పార్టీలు కనుమరుగయ్యాయి. ఏ ప్రాతిపదికన డీలిమిటేషన్ చేపడతారనే దానిపై స్పష్టత లేదు. జనాభా ప్రాతిపదికన జరిగిన దక్షిణాది రాష్ట్రాలకు నష్టం. హిల్ట్ విధానం ద్వారా ఎలాంటి అవినీతి జరగదు. కాలుష్యం కట్టడికి పారిశ్రామిక భూముల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం నిర్ణయించింది. ఉపాధి హామీ పథకంలో గాంధీ పేరు తొలగించడం సరికాదు" అని గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు.

# బీసీలకు చట్టబద్ధమైన బీసీ సబ్ ప్లాన్ తక్షణమే అమలు చేయాలి తెలంగాణ రాజ్యాధికార పార్టీ డిమాండ్

జనగామ ఏవో కి వినతి పత్రం

**సామాన్యుడి అస్త్రం జనగామ** తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పిలుపు మేరకు,ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జి, పల్లెబోయిన అశోక్ , జిల్లా అధ్యక్షురాలు చెరుకూరి మౌనిక యాదవ్ సూచన మేరకు ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ తరహాలోనే వెనుకబడిన తరగతుల (బీసీ) సమగ్ర అభివృద్ధి కోసం చట్టబద్ధమైన బీసీ సబ్ ప్లాన్"ను తక్షణమే అమలు చేయాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ డిమాండ్ చేస్తుంది ఈ మేరకు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఊదరి సతీష్ ముదిరాజ్ , జిల్లా కార్యదర్శి చిర్రా వీరస్వామి మరియు జిల్లా నాయకులతో కలిసి బుధవారం జనగామ జిల్లా కలెక్టరేట్ లో ఏవో కి వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీల సామాజిక, ఆర్థిక, విద్యా అభివృద్ధి కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయింపులు, చట్టపరమైన రక్షణ అత్యంత అవసరమని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 2014 నుంచి ఇప్పటి వరకు బీసీల కోసం బడ్జెట్‌లో కేటాయించిన నిధులను పూర్తిస్థాయిలో ఖర్చు చేయకుండా మిగులు చూపడం వల్ల బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని విమర్శించారు కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం కాంగ్రెస్ పార్టీ బీసీలకు ప్రతి బడ్జెట్‌లో రూ.20 వేల కోట్లు కేటాయిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో యూత్ జిల్లా అధ్యక్షులు మంద దిలీప్, జిల్లా ఉపాధ్యక్షులు జిట్టబోయిన



నరేష్, జిల్లా ఉపాధ్యక్షులు, చొప్పరి సంతోష్, పట్టణ అధ్యక్షులు, గడ్డం కృష్ణ, వివిధ మండల అధ్యక్షులు మరియు ఉపాధ్యక్షులు, కలకోట బాబు,శాద నరేష్ , రాగుల ప్రశాంత్, ముక్క విష్ణువర్ధన్, ఆకుల నరసింహులు, నాయిని మహిపాల్, వల్లాల భానుచందర్, బొంకురి రమేష్, బోడ రమేష్, తదితరులు పాల్గొన్నారు

## లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్ప్రింగ్ వ్యాలీ గ్లోబల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



**సామాన్యుడి అస్త్రం జనగామ** జనగామలోని స్ప్రింగ్ వ్యాలీ గ్లోబల్ స్కూల్ (ఎస్ వి జి ఎస్) విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటారు. ఈ పాఠశాలకు చెందిన బేబీ ఫర్హానా (6వ తరగతి), బేబీ మన్హా ఉల్ జియా (4వ తరగతి), మరియు బేబీ మెహెక్ ఉల్ జియా (2వ తరగతి) (టైక్వాండో ) విభాగంలో కనబరిచిన అద్భుత ప్రతిభకు గాను లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ నుండి ధృవీకరణ పత్రాలు మరియు బంగారు పతకాలను అందుకున్నారు ఈ అసాధారణ విజయాన్ని సాధించిన విద్యార్థులను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ప్రత్యేకంగా అభినందించి, సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ శ్రీ నలుసాని తిరుపతి రెడ్డి మరియు సెక్రటరీ/కరస్పాండెంట్ శ్రీ రావుల ఉపేందర్ బాబు మాట్లాడుతూ విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన మాస్టర్ అబ్బాస్‌ను, పతకాలు సాధించిన విద్యార్థులను ప్రశంసించారు. వారు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు

## హామీలు ఎక్కడ..?

ఇల్లందకుంటలో తెలంగాణ ఉద్యమకారుల ఘాటు నిరాహార దీక్ష



**సామాన్యుడి అస్త్రం ఇల్లందకుంట** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టి పోరాడిన ఉద్యమకారుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందంటూ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఇల్లందకుంట మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు వెంకట సంజీవరెడ్డి నేతృత్వం వహించగా, రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ఉద్యమకారులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వెంకట సంజీవరెడ్డి మాట్లాడుతూడ "తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నాం కానీ ఉద్యమకారుల జీవితం మాత్రం ఇప్పటికీ పోరాటంగానే ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యమకారులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చింది. కానీ నేటికీ ఒక్క హామీ కూడా అమలు కాలేదు" అని మండిపడ్డారు. 250 గజాల స్థలాలు వెంటనే ఇవ్వాలి ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం ప్రతి అర్హులైన తెలంగాణ ఉద్యమకారుడికి 250 గజాల ఇళ్ల స్థలాలను తక్షణమే కేటాయించాలని డిమాండ్ చేశారు. సంవత్సరాలు గడుస్తున్నా ఫైళ్లు కదలకపోవడం అన్యాయమన్నారు. రూ.10 వేల కోట్లతో సంక్షేమ బోర్డు తెలంగాణ ఉద్యమకారుల కుటుంబాల భద్రత కోసం రూ.10 వేల కోట్ల ప్రత్యేక బడ్జెట్ కేటాయింపుతో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యమకారుల పిల్లలకు విద్య, వైద్యం, ఉపాధి భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరాహార దీక్షలో పలువురు తెలంగాణ ఉద్యమకారులు పాల్గొని ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో ప్రాంగణాన్ని దద్దరిల్లేలా చేశారు

## కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన

ఇల్లంతకుంట బీజేపీ మండల నాయకులు

అయ్యప్ప స్వామి పవిత్ర ప్రసాదం అందజేత

**సామాన్యుడి అస్త్రం ఇల్లంతకుంట** ఇల్లంతకుంట బీజేపీ మండల నాయకులు మట్ట పవన్ రెడ్డి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా తన ఇష్టదైవమైన శబరిమలై అయ్యప్ప స్వామి వారి పవిత్ర ప్రసాదాన్ని భక్తిశ్రద్ధలతో మంత్రికి అందజేశారు. ఆధ్యాత్మికత, ప్రజాసేవ సమ్మేళనంగా సాగిన ఈ భేటీ రాజకీయ వర్గాల్లో ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకుంది. అయ్యప్ప స్వామి ఆశీస్సులు బండి సంజయ్ కుమార్‌పై ఎల్లవేళలా ఉండాలని, దేశ భద్రత, అంతర్గత రక్షణ బాధ్యతలతో పాటు ప్రజాసేవలో ఆయన మరింత శక్తి, ఆరోగ్యం, దీర్ఘాయుష్షు పొందాలని మట్ట పవన్ రెడ్డి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మట్ట పవన్ రెడ్డి మాట్లాడుతూ, ఆధ్యాత్మిక విలువలు కలిగిన నాయకత్వమే దేశానికి సరైన దిశను చూపగలదని అన్నారు. అయ్యప్ప స్వామి ఆశీస్సులతో బండి సంజయ్ కుమార్ ప్రజాసేవలో మరింత దృఢంగా ముందుకు సాగుతున్నారని కొనియాడారు. దేశ భద్రత, సరిహద్దుల రక్షణ, ఉగ్రవాద నిర్మూలన వంటి అంశాల్లో కేంద్ర హోంశాఖ కీలక పాత్ర పోషిస్తోందని, అందులో భాగంగా బండి సంజయ్ చేస్తున్న సేవలు అభినందనీయమని తెలిపారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా బండి సంజయ్ కుమార్ దేశ భద్రత విషయంలో రాజీ లేని వైఖరితో పనిచేస్తున్నారని ప్రశంసించారు. ఉగ్రవాదం, అక్రమ కార్యకలాపాలు, దేశవిరోధ శక్తులపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు.



కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రతి నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా బండి సంజయ్ నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. సామాన్య కార్యకర్తలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే నాయకుడిగా ఆయన ప్రత్యేకతను గుర్తించారు. ఇల్లంతకుంట మండల అభివృద్ధికి కేంద్రం నుంచి మరిన్ని నిధులు తీసుకురావడంలో బండి సంజయ్ సహకారం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ భేటీ బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపిందని కార్యకర్తలు అభిప్రాయపడ్డారు


# హుజురాబాద్‌లో డంపింగ్ యార్డ్‌పై సబ్బని సైరన్



సబ్బని వెంకట్ ఉద్యమానికి బలం రాజకీయ పార్టీల్లో కలవరం

స్పందించకపోతే హైకోర్టు దాకా పోరు : సబ్బని వెంకట్ స్పష్టం

**సామాన్యుడి అస్త్రం హుజురాబాద్** హుజురాబాద్ నియోజకవర్గంలో ఏర్పాటు చేయ తలపెట్టిన డంపింగ్ యార్డ్ అంశం ఇప్పుడు రాజకీయ పరిధిని దాటి ప్రజల జీవన సమస్యగా మారింది. గత టీఆర్ఎస్ ప్రభుత్వం చివరి దశలో జారీ చేసిన డంపింగ్ యార్డ్‌కు సంబంధించిన జీవోను రద్దు చేయడంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లుగా నిర్లక్ష్యం వహిస్తోందని ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశాన్ని తొలిసారిగా బలంగా ప్రజల ముందుకు తీసుకువచ్చిన ప్రముఖ సామాజికవేత్త, రాజకీయ విశ్లేషకుడు సబ్బని వెంకట్‌కు గ్రామస్తులు, రైతులు, మేధావులు పెద్ద ఎత్తున వినతిపత్రాలు అందజేస్తూ ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటు వల్ల పసిపిల్లల ఆరోగ్యం, రైతుల జీవనం, పంట పొలాలు, త్రాగునీటి వనరులు తీవ్ర ప్రమాదంలో పడతాయని సబ్బని వెంకట్ ఇప్పటికే పలు మాధ్యమాల ద్వారా హెచ్చరిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో తెలంగాణ జన సమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం హుజురాబాద్ పర్యటన సందర్భంగా సిరసపల్లిలోని సబ్బని వెంకట్ నివాసానికి చేరుకొని, విలేకరులు మరియు గ్రామస్తుల సమక్షంలో డంపింగ్ యార్డ్ వల్ల తలెత్తే భయానక పరిణామాలపై



సుదీర్ఘంగా చర్చించారు. ప్రజల ఆరోగ్యం, భవిష్యత్ తరాల శ్రేయస్సు కోసం జరిగే ప్రతి ఉద్యమానికి తాను సంపూర్ణ సహకారం అందిస్తానని, అవసరమైతే ముఖ్యమంత్రి దృష్టికి కూడా తీసుకెళ్లేందుకు సిద్ధమని ప్రొఫెసర్ కోదండరాం ప్రకటించడం ఉద్యమానికి మరింత బలాన్ని చేకూర్చింది. సబ్బని వెంకట్‌కోదండరాం సంయుక్తంగా ప్రెస్ నోట్ విడుదల చేసిన కొద్ది గంటల వ్యవధిలోనే ఎమ్మెల్సీ బలుమూరు వెంకట్ శాసనమండలి వేదికగా ఈ డంపింగ్ యార్డ్ అంశాన్ని లేవనెత్తడం గమనార్హం. ఇప్పటివరకు నోరు మెదపని రాజకీయ పార్టీలు ఒక్కసారిగా కదలికలోకి రావడం వెనుక సబ్బని వెంకట్ ఉద్యమ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. డంపింగ్ యార్డ్ ఏర్పాటుతో వాతావరణ కాలుష్యం, శ్వాసకోశ వ్యాధులు, క్యాన్సర్ ముప్పు, త్రాగునీటి విషతుల్యం, పంట భూముల నాశనం వంటి తీవ్రమైన పరిణామాలు తప్పవని నిపుణులు హెచ్చరిస్తున్నప్పటికీ, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం ప్రజల్లో ఆగ్రహాన్ని మరింత రగిలిస్తోంది. ఈ విషయమై త్వరలో మున్సిపల్ శాఖ మంత్రిని కలుస్తామని, అక్కడ కూడా స్పందన లేకపోతే ప్రజల తరఫున హైకోర్టును ఆశ్రయించేందుకు వెనుకాడబోమని సబ్బని వెంకట్ స్పష్టం చేశారు. ప్రజల కోసం, హుజురాబాద్ భవిష్యత్తు కోసం చివరి నిమిషం వరకు పోరాడతానని ఆయన ఇచ్చిన సంకేతాలతో రాజకీయ వర్గాల్లో ఉలిక్కిపాటు మొదలైంది.

## కళ్ళుండీ చూడలేని కబోదులా.. ?

షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ధ్వజం..

కొందుర్గులో ఇంటిగ్రేటెడ్ పాఠశాల పనులను పరిశీలించిన ఎమ్మెల్యే..

శరవేగంగా సాగుతున్నాయని ప్రశంస..

ప్రతిపక్షానికి జరుగుతున్న పనులు కనిపించడం లేదా అని ఆగ్రహం



**సామాన్యుడి అస్త్రం షాద్ నగర్ :**శరవేగంగా పనులు జరుగుతున్నా ఇంకా మొదలు కాలేదు అంటూ కళ్ళు ఉండి చూడలేని కబోదుల్లా కొందరు వ్యవరిస్తున్నారని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ధ్వజమెత్తారు. కొందుర్గు మండల కేంద్రంలో బుధవారం ఇంటిగ్రేటెడ్ పాఠశాల పనులను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇక్కడ శరవేగంగా పనులు కొనసాగుతున్నాయని, సీఎం వచ్చి వెళ్లిన వెంటనే పనులు ప్రారంభమయ్యాయి అని గుర్తు చేశారు. జరుగుతున్న పనులను చూడకుండా, కనీసం తెలుసుకోకుండా శాసనమండలి సాక్షిగా కొందరు అబద్ధాలు చెప్పడం హాస్యాస్పదమన్నారు. ఇకనుంచి దేని గురించి అయినా మాట్లాడేటప్పుడు ఒక్కసారి తెలుసుకొని ప్రతిపక్షాలు మాట్లాడితే మంచిదని హితవు చెప్పారు. అసెంబ్లీ అయిన, శాసనమండలి అయిన ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చి పనులు చేయడానికి తప్ప అబద్ధాలు ప్రచారం చేయడానికి కాదని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ఇంటిగ్రేటెడ్ పాఠశాల తెలంగాణ రాష్ట్రానికే అక్షర వన్నెలు తెచ్చి దేశానికే ఆదర్శంగా మారబోతుందని ఆయన ప్రశంసించారు. త్వరలోనే ఈ పాఠశాల పనులు పూర్తి అవుతాయని, అన్ని వర్గాల ప్రజలకు ఈ పాఠశాల అందుబాటులోకి వస్తుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. బాధ్యత గల ప్రతిపక్షం ప్రభుత్వానికి సరైన సూచనలు సలహాలు ఇవ్వాలని అంతేకానీ రాజకీయ లబ్ధి స్వప్రయోజనాల కోసం పాకులాడకూడదని హితవు పలికారు....

## బైలంపూర్‌తానేదారిపల్లి దేవాలయాల నిర్మాణానికి గ్రామసభలో ఏకగ్రీవ తీర్మానం

**సామాన్యుడి అస్త్రం గజ్వేల్** గజ్వేల్ నియోజకవర్గం ములుగు మండలంలో బుధవారం బైలంపూర్ గ్రామపంచాయతీలో గ్రామ అభివృద్ధి దిశగా కీలక నిర్ణయం తీసుకున్నారు. బైలంపూర్ సర్పంచ్ మచ్చల కృష్ణ గారు, ఉపసర్పంచ్ సింగం కనకయ్య గారు, వంటిమామిడి ఏఎంసీ వైస్ చైర్మన్ కొడిత్యాల ప్రభాకర్ గుప్తా గారు, వార్డు సభ్యులు మరియు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించబడింది. ఈ గ్రామసభలో బైలంపూర్‌తానేదారిపల్లి గ్రామాలకు



సంబంధించిన పెండింగ్‌లో ఉన్న దేవాలయాల నిర్మాణాలపై విస్తృతంగా చర్చించి, వాటిని పూర్తి చేయడంతో పాటు నూతనంగా ప్రారంభించాల్సిన దేవాలయాల నిర్మాణానికి ఏకగ్రీవంగా తీర్మానం చేయడం జరిగింది.గ్రామ దేవతల ఆలయాల నిర్మాణం ద్వారా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం పెరుగుతుందని, అలాగే గ్రామ ఐక్యత మరింత బలపడుతుందని గ్రామసభలో అభిప్రాయపడ్డారు. ఈ తీర్మానాన్ని త్వరలో అమలులోకి తీసుకురావాలని గ్రామపంచాయతీ నిర్ణయించింది. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు ది

## బొల్లారం డంప్‌యార్డ్‌కు విముక్తి దిశగా అడుగులు చెత్త తరలింపుకు శ్రీకారం

**అస్త్రం, బొల్లారం :** బొల్లారం డివిజన్ ప్రజలకు ఎట్టకేలకు ఊరట లభించే పరిణామం చోటుచేసుకుంది. సంవత్సరాలుగా బొల్లారం ప్రాంత ప్రజలను వేధిస్తున్న డంప్‌యార్డ్ సమస్యకు పరిష్కార దిశగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్





కార్పొరేషన్ కీలక అడుగు వేసింది. బొల్లారం డివిజన్ పరిధిలో ఉన్న డంప్ యార్డ్ నుండి చెత్తను తరలించే ప్రక్రియను ప్రారంభించేందుకు జిహెచ్ఎంసి ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా చర్యలు చేపట్టింది. బుధవారం జిహెచ్ఎంసి అమీన్‌పూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో రాంకీ సంస్థ అధికారులతో కలిసి బొల్లారం డంపింగ్ యార్డ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ పేరుకుపోయిన భారీగా చెత్తను పరిశీలించిన అధికారులు, ప్రజారోగ్యం మరియు పర్యావరణంపై తీవ్ర ప్రభావం చూపుతున్న పరిస్థితిని గమనించారు. డంపింగ్ యార్డ్‌లో పేరుకుపోయిన మొత్తం చెత్తను జవహర్ నగర్ ప్రాసెసింగ్ యూనిట్‌కు తరలించాల్సిందిగా డిప్యూటీ కమిషనర్ రాంకీ సంస్థ అధికారులను స్పష్టంగా ఆదేశించారు. చెత్త తరలింపుకు అవసరమైన యంత్రాలు, వాహనాలు, మానవ వనరులపై సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. దీనిపై స్పందించిన రాంకీ అధికారులు, డంప్ యార్డ్‌లోని చెత్తను దశలవారీగా జవహర్ నగర్‌కు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, మరో వారం రోజుల్లో చెత్త తరలింపు ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. డంప్ యార్డ్ కారణంగా బొల్లారం పరిసర ప్రాంతాల్లో దుర్వాసన, దోమల బెడద, ఆరోగ్య సమస్యలు తీవ్రంగా ఉన్నాయని స్థానికులు గత కొంతకాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జిహెచ్ఎంసి చేపట్టిన చర్యలు ప్రజల్లో ఆశలు రేకెత్తిస్తున్నాయి. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్, బొల్లారం డివిజన్‌లో పనిచేస్తున్న అధికారులు మరియు పారిశుద్ధ్య సిబ్బంది పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. డంప్ యార్డ్ తొలగింపుతోనే సరిపెట్టకుండా, భవిష్యత్తులో చెత్త పేరుకుపోకుండా పక్కా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. బొల్లారం డివిజన్‌ను చెత్త రహిత డివిజన్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో సమిష్టిగా పనిచేయాలని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటరమణకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్లు టి. నరసింహులు, మల్లికార్జున స్వామి, రాంకీ డివిజనల్ హెడ్ నిరాకర్ మాలిక్, సెక్టార్ హెడ్ రామకృష్ణారెడ్డి, ఏఈలు, సానిటరీ ఇన్స్పెక్టర్లు మధు, వినోద్, డివిజన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. బొల్లారం డంప్ యార్డ్ నుండి చెత్త తరలింపు పూర్తయితే, ప్రాంత ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం లభించడంతో పాటు ఆరోగ్య సమస్యలు తగ్గే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. జిహెచ్ఎంసి చేపట్టిన ఈ చర్యలు కొనసాగితే, బొల్లారం డివిజన్ నిజంగా ఆదర్శ డివిజన్‌గా మారుతుందన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.

# మున్సిపాలిటీలను బీజేపీకి ఇవ్వండిడ అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తాం

**కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఘాటు విమర్శలు**



**సామాన్యుడి అస్త్రం జమ్మికుంట** హుజురాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీలను బీజేపీకి అప్పగిస్తే అభివృద్ధి అంటే ఏమిటో ప్రజలకు చేతలతో చూపిస్తామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్, గతంలో ఉన్న బీఆర్ఎస్ పాలకులు మున్సిపాలిటీలను దోచుకున్నారే తప్ప ప్రజలకు మౌలిక వసతులు కల్పించలేదని ఆయన మండిపడ్డారు. జమ్మికుంట డిగ్రీ అండ్ పీజీ కళాశాల ఆవరణలో సింథటిక్ స్టేడియం నిర్మాణానికి సంబంధించిన స్థలాన్ని పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, "రాష్ట్రంలో బీజేపీ అధికారంలో లేకపోయినా కేంద్రం నుంచి నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తున్నాం. మరి అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఏం చేస్తోంది? ప్రజలకు చెప్పాలి" అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో మున్సిపాలిటీల దోపిడీ మున్సిపాలిటీలకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని ఆరోపించారు. జమ్మికుంట, హుజురాబాద్ మున్సిపాలిటీల్లో చైర్మన్లు లేకుండా పరిపాలన అస్తవ్యస్తంగా మారిందని, అధికారులు ఎవరి మాట వినకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. "మున్సిపాలిటీలను అభివృద్ధి చేయాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్‌కు లేదు. ప్రజల సమస్యలపై వారికి పట్టదు" అని ఘాటుగా వ్యాఖ్యానించారు. సింథటిక్ స్టేడియానికి రూ.6.5 కోట్లు కాంగ్రెస్ వల్ల కాదు జమ్మికుంట డిగ్రీ అండ్ పీజీ కళాశాల స్థలంలో సింథటిక్ స్టేడియం నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.6.5 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. "ఇది కాంగ్రెస్ దయ వల్ల వచ్చిన నిధి కాదు. బీజేపీ కేంద్ర ప్రభుత్వ కృషి ఫలితం. అవసరమైతే మరిన్ని నిధులు కూడా తెస్తాం" అని స్పష్టం చేశారు. త్వరలోనే టెండర్ ప్రక్రియ ప్రారంభించి పనులు మొదలుపెడతామని చెప్పారు. కళాశాల భూముల కబ్జాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన బండి సంజయ్, "ప్రభుత్వ భూములను కబ్జా చేయడం నేరం. ఎవరు ఎంత పెద్దవారైనా కబ్జాలకు పాల్పడితే చర్యలు తప్పవు" అని హెచ్చరించారు. కేంద్రం డబ్బులతోనే ఆసుపత్రులు, పాఠశాలలు ఇటీవల జమ్మికుంట, హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రులకు రూ.3 కోట్ల విలువైన వైద్య పరికరాలు అందించామని తెలిపారు. కుల సంఘాలు, ఆలయాలు, పాఠశాలలకు కూడా నిధులు మంజూరు చేశామని చెప్పారు. "ఇవన్నీ కేంద్రం నిధులతోనే జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఏంటో చెప్పగలరా?" అని ప్రశ్నించారు. నాయిని చెరువును పర్యాటక కేంద్రంగా మారుస్తాం జమ్మికుంట మున్సిపాలిటీని బీజేపీకి అప్పగిస్తే నైని చెరువును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. బోటింగ్, పార్కులతో చెరువును ప్రజలకు ఆహ్లాదకరంగా మార్చుతామని తెలిపారు. అద్దె ఇళ్లలో నివసించే పేద కుటుంబాలను వేధిస్తున్నారని పేర్కొంటూ, "స్థలం కేటాయిస్తే ఎంపీ నిధులతో ప్రత్యేక భవన సముదాయం నిర్మించి బాధిత కుటుంబాలకు శాశ్వత పరిష్కారం చూపిస్తాం" అని అన్నారు. కేంద్రం నిధులు తెచ్చే శక్తి బీజేపీకే రాష్ట్ర ప్రభుత్వానికి నిధులు లేవని, అభివృద్ధి చేయాలనే సామర్థ్యం కూడా లేదని బండి సంజయ్ తీవ్ర విమర్శలు చేశారు. "కేంద్రం నుంచి నిధులు తెచ్చి పనులు చేయగల శక్తి బీజేపీకే ఉంది. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి సరైన నిర్ణయం తీసుకోవాలి" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, స్థానిక నాయకులు ఆకుల రాజేందర్, రఘు తదితరులు పాల్గొన్నారు

## కనిపించని విద్యాశాఖ మంత్రి విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలా?



**అస్త్రం, శేరిలింగంపల్లి :** మండలం మసీద్ బండకొండాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న దారుణ పరిస్థితులపై అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. రాష్ట్రంలో విద్యాశాఖకు మంత్రే లేని పరిస్థితి నెలకొని ఉండటంతో ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యంగా మారాయని ఏఐఎస్ఎఫ్ మండిపడింది. సదరు ప్రభుత్వ పాఠశాలలో గత 15 సంవత్సరాలుగా (జి.హెచ్.ఎం) గెజిటెడ్ హెడ్‌మాస్టర్ పోస్టు ఖాళీగా ఉండటం విద్యా వ్యవస్థ పతనానికి ప్రధాన కారణమని ఏఐఎస్ఎఫ్ నేతలు ఆరోపించారు. స్కూల్‌కు పూర్తి స్థాయి హెడ్‌మాస్టర్ లేకపోవడంతో పాలన పూర్తిగా కుంటుపడిందని, దీనివల్ల విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలోకి నెట్టబడుతోందని విమర్శించారు. అదేవిధంగా ప్రభుత్వ ప్రతిష్టాత్మకమైన మధ్యాహ్న భోజన పథకం పూర్తిగా విఫలమైందని తెలిపారు. రోజురోజుకీ కేవలం 20 నుంచి 30 శాతం విద్యార్థులే మధ్యాహ్న భోజనం తీసుకుంటుండగా, మిగతా విద్యార్థులు ఇంటి నుంచి భోజనం తెచ్చుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇది విద్యార్థులపై ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. పాఠశాలలో మౌలిక సదుపాయాల లేమి తీవ్రంగా ఉందని ఏఐఎస్ఎఫ్ పేర్కొంది. క్లాస్‌రూమ్‌లలో సరిపడా లైట్లు, ఫ్యాన్స్ లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. అలాగే టాయిలెట్లు పరిశుభ్రంగా లేకపోవడం, నీటి సరఫరా క్రమంగా లేకపోవడం విద్యార్థుల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టుతోందని హెచ్చరించారు. విద్యార్థుల భద్రత విషయంలోనూ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. పాఠశాల ముందు వాచ్‌మన్ లేకపోవడంతో విద్యార్థులు ఎవరూ పట్టించుకోకుండా బయటికి వెళ్లి రావడం జరుగుతోందని, ఇది తీవ్రమైన ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని తెలిపారు. వెంటనే స్కూల్ ముందు వాచ్‌మన్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలను ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని ఏఐఎస్ఎఫ్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రభుత్వానికి విద్యపై చిత్తశుద్ధి ఉంటే వెంటనే విద్యాశాఖకు పూర్తి స్థాయి మంత్రిని నియమించాలి అని డిమాండ్ చేసింది. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని ఏఐఎస్ఎఫ్ శేర్లింగంపల్లి మండలం అధ్యక్షుడు టీ. నితీష్, కార్యదర్శి జె. ధర్మతేజ స్పష్టం చేశారు. విద్యార్థుల హక్కుల కోసం రోడ్డెక్కేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు.

## రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

**హుజురాబాద్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కంచి వేణు**

**సామాన్యుడి అస్త్రం హుజురాబాద్** జాతీయ రహదారి భద్రత మాసోత్సవం సందర్భంగా హుజురాబాద్‌లో రహదారి భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాతీయ రహదారిపై ప్రయాణించే కారు, లారీ, మోటార్ క్యాబ్, మ్యాక్స్ క్యాబ్, త్రీ వీలర్, ఫోర్ వీలర్ వాహనాల డ్రైవర్లు పాల్గొన్నారు.దఈ సందర్భంగా హుజురాబాద్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కంచి వేణు మాట్లాడుతూ, రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నియమాలు తెలుసుకొని, వాటిని విధిగా పాటించినప్పుడే రోడ్డు ప్రమాదాలను నివారించగలమన్నారు. రోడ్లపై వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ భద్రతా నియమాలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. వాహనదారులు బయటకు వెళ్లేటప్పుడు తమ కుటుంబ సభ్యులు తమ కోసం వెయ్యి కళ్లతో ఎదురు చూస్తుంటారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ప్రమాదాల్లో కుటుంబానికి పెద్దదిక్కు కోల్పోతే ఆ కుటుంబం మొత్తం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి వాహనం నడిపేటప్పుడు అత్యంత జాగ్రత్తలు పాటించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లు నడిపేవారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. అతివేగం అనర్థదాయకమని, మద్యం తాగి వాహనం నడపడం వల్ల ప్రాణనష్టం జరిగే ప్రమాదం అధికంగా ఉంటుందని హెచ్చరించారు. మొబైల్ ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం అతివేగమే ప్రధాన కారణమని పేర్కొన్నారు. వాహనాలు నడిపే ప్రతి వ్యక్తి ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ, ఇతరులకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తగా ప్రయాణించాలన్నారు. రహదారి భద్రతపై ప్రజలకు



పూర్తిస్థాయి అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చే ఆటోలు, జీపులు, ఇతర ప్రైవేట్ రవాణా వాహనాలు నిర్ణయించిన పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లకూడదన్నారు. ప్రమాదాల వల్ల కలిగే దుష్పరిణామాలు, ఆ తర్వాత కుటుంబాలు ఎదుర్కొనే పరిస్థితులపై ప్రత్యేక కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పిస్తామని తెలిపారు. రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు నిరంతరం వాహన తనిఖీలు చేపడుతున్నామని, మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలకు అవకాశం ఉండదన్నారు. హెల్మెట్ ధరించాలి, సీట్ బెల్ట్ పెట్టుకోవాలి, మొబైల్ ఫోన్ వాడకూడదు, మద్యం సేవించి వాహనం నడపకూడదు, అతివేగాన్ని నియంత్రించాలి, ట్రాఫిక్ సంకేతాలు తప్పనిసరిగా పాటించాలి. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ సిబ్బంది ట్రాన్స్‌పోర్ట్ కానిస్టేబుల్ కత్తుల నాగరాజు, హోంగార్డు బుర్ర సురేష్, జాతీయ పర్మిట్ కలిగిన లారీ డ్రైవర్లు మరియు ఇతర వాహనదారులు పాల్గొన్నారు

## నకిలీ మద్యం మాఫియాపై ఉక్కుపాదం!

**గచ్చిబౌలిలో జిల్లా టాస్క్ ఫోర్స్ మెరుపుదాడులు**
**139 నకిలీ సీసాలు స్వాధీనం**



**అస్త్రం, శేరిలింగంపల్లి :** నగరంలో నకిలీ విదేశీ మద్యం తయారీ, రవాణా, విక్రయాలకు పాల్పడుతున్న ముఠాపై జిల్లా టాస్క్ ఫోర్స్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. డీసీపీ దశరథ్ ఆదేశాల మేరకు జిల్లా టాస్క్ ఫోర్స్, శంషాబాద్ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మెరుపుదాడుల్లో నకిలీ మద్యం ముఠా గుట్టు రట్టయ్యింది. విశ్వసనీయ సమాచారం మేరకు బుధవారం తెల్లవారుజామున గచ్చిబౌలి ఫ్లైఓవర్ సమీపంలోని ఇందిరానగర్ లింగంపల్లి రోడ్డుపై రూట్ వాచ్ నిర్వహిస్తున్న పోలీసులు, స్కూటీపై అనుమానాస్పదంగా తరలిస్తున్న వ్యక్తులను అడ్డుకున్నారు. తనిఖీ చేయగా గ్లెన్‌అవెట్ బ్రాండ్ పేరుతో 15 నకిలీ విదేశీ మద్యం సీసాలు బయటపడ్డాయి. ఈ ఘటనలో లిదేశిని ప్రకాష్ గౌడ్ (29)లితో పాటు మరో వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టైన ప్రకాష్ గౌడ్ ఇచ్చిన సమాచారం ఆధారంగా కేపీహెచ్బీలోని అతని అద్దె ఇంటిపై దాడి చేయగా, అక్కడ నకిలీ మద్యం తయారీ కేంద్రం వెలుగులోకి వచ్చింది. ఇంట్లో తనిఖీల్లో గ్లెన్‌డిచ్, చివాస్, డివార్స్, బ్లూ లేబుల్, విలియం లాసన్ వంటి ఖరీదైన విదేశీ బ్రాండ్ల పేర్లతో తయారు చేసిన 46 నకిలీ మద్యం సీసాలు పట్టుబడ్డాయి. ఈ వ్యవహారంలో సహకరిస్తున్న మరో వ్యక్తిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తదుపరి కొండాపూర్‌లోని మృత్యుంజయ మహంతి నివాసంలో నిర్వహించిన సోదాల్లో మరింత సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. తక్కువ ధరకు లభించే మద్యాన్ని ఖరీదైన విదేశీ బ్రాండ్ సీసాల్లో నింపి, సీలు వేసి అసలైన మద్యం అంటూ విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. అతని వద్ద నుంచి 54 నకిలీ మద్యం సీసాలు, 136 ఖాళీ సీసాలు, ఒక స్కూటీ స్వాధీనం చేసుకున్నారు. ఇదే క్రమంలో మధాపూర్ ప్రాంతంలో మరోచోట తనిఖీలు నిర్వహించిన పోలీసులు 24 నకిలీ మద్యం సీసాలను పట్టుకున్నారు. ఈ వరుస దాడుల్లో మొత్తం 139 నకిలీ మద్యం సీసాలు, 136 ఖాళీ సీసాలు, మూడు స్కూటీలు, నాలుగు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని, నకిలీ మద్యం ముఠాకు చెందిన ఐదుగురిని అరెస్టు చేశారు. ఖరీదైన విదేశీ మద్యం పేరుతో నకిలీ మద్యం విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఈ ముఠాపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు. నకిలీ మద్యం కారణంగా ప్రాణాపాయం ఉన్న నేపథ్యంలో, ఇలాంటి అక్రమాలకు పాల్పడితే ఎంతటి శిక్షైనా తప్పదని హెచ్చరించారు. నగరంలో నకిలీ మద్యం వ్యాపారంపై పూర్తిస్థాయిలో నిఘా పెంచామని, ఇటువంటి అక్రమాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా టాస్క్ ఫోర్స్ దాడులు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

## గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం




**సామాన్యుడి అస్త్రం జమ్మికుంట** సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ సి.హెచ్. లచ్చయ్య తెలిపారు. బుధవారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ కులాలకు చెందిన విద్యార్థులు గురుకుల పాఠశాలల్లో చేరేందుకు దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైందని వెల్లడించారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ నెల 21వ తేదీ లోపు అవసరమైన ధ్రువపత్రాలతో సమీపంలోని మీసేవ కేంద్రాల్లో రూ.100 ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్షను ఫిబ్రవరి 22న ఎంపిక చేసిన గురుకుల పాఠశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా విద్యార్థులకు మొదటి ప్రాధాన్యతగా ఎంపిక చేసిన పాఠశాలలో ప్రవేశం కల్పిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ విలువైన అవకాశాన్ని ప్రతి అర్హత కలిగిన విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ సి.హెచ్. లచ్చయ్య కోరారు

## గడ్డి మందు తాగి వ్యక్తి మృతి

**ఇల్లందకుంటలో విషాద ఘటన**



**సామాన్యుడి అస్త్రం ఇల్లందకుంట** ఇల్లందకుంట మండలం లక్ష్మాజీపల్లి గ్రామానికి చెందిన వేమా రాజు (36) అనే వ్యక్తి గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన స్థానికంగా విషాదం నింపింది. వివరాల్లోకి వెళ్తే.. లక్ష్మాజీపల్లికి చెందిన వేమా రాజు, తండ్రి వీరయ్య, ముదిరాజ్ కులానికి చెందిన వ్యక్తి. గత కొద్ది రోజులుగా మద్యానికి బానిసై ఉన్న అతడు, తన భార్య పుట్టింటికి వెళ్లి తిరిగి రావడం లేదని మనస్థాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో తీవ్ర నిరాశలో మునిగిపోయిన వేమా రాజు, తేదీ 02-01-2026 నాడు గడ్డి మందు తాగాడు. అతడిని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే వరంగల్‌లోని వీ+వీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ రోజు ఉదయం 05:30 గంటలకు మృతి చెందాడు. మృతుని తల్లి వేమా విమల ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇల్లందకుంట పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహానికి పంచనామా నిర్వహించారు. అనంతరం మృతికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి

## ఆర్ట్స్ కళాశాల ఉద్భావ్ 2026 ఫెస్టివల్ కార్యక్రమంలో పాల్గొన్న కంబాల

**ఈ కార్యక్రమానికి కంబాల 2 లక్షల 25 వేలు రూపాయలు భారీ ఆర్థిక సహాయం**



**సామాన్యుడి అస్త్రం తూర్పుగోదావరి :** రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో సంక్రాంతి సందర్భంగా బుధవారం ప్రారంభించిన ఉద్భావ్ 2026 టాలెంట్ హంట్ ఫెస్టివల్ కార్యక్రమంలోబి విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, భారతీయ జనతా పార్టీ నాయకులు కంబాల శ్రీనివాసరావు పాల్గొన్నారు. తొలిత ఆయనకు కళాశాల యువతి, యువకులు భారీ స్వాగతం పలికారు. ఫెస్టివల్ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్, సంక్రాంతి పండుగ ఏర్పాట్లను పరిశీలించారు. విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతి, కార్యక్రమాలను తిలకింకించారు. సంస్కృతి కార్యక్రమాలలో ప్రతిభ కనబరిచిన పలువురికి విద్యార్థులకు 40 వేలు రూపాయలు నగదు బహుమతి అందజేశారు. ఈ ఉద్భావ్ 2026 ఫెస్టివల్ కార్యక్రమానికి కంబాల శ్రీనివాసరావు గారు రెండు లక్షల 25, వేలు రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## 30 ఏళ్ల క్రితం... వణికించిన బ్లోఅవుట్

**8 జనవరి 1995..సాయంత్రం 6:50కి ఎగసిపడిన మంటలు**

**కాకినాడ :** కోనసీమ అంటే ప్రకృతి అందాలు..పండుగలు..రకరకాల వంటకాలు మాత్రమే అనుకునే రోజుల్లో జరిగిన అగ్ని ప్రమాదం దేశాన్నే వణికించింది. ఌఔఉఅ గ్యాస్ లీక్ వల్ల ఏర్పడిన పాశర్లపూడి బ్లో ఔట్ కోనసీమ పేరును దేశ వ్యాప్తంగా గుర్తుండిపోయేలా చేసింది. మరో భోపాల్ దుర్ఘటనలా మారుతుందా అనే విశ్లేషణలు, భయాలు వెలువడేలా చేసిన పాశర్లపూడి బ్లో ఔట్ ఘటన కు 30 ఏళ్ళు పూర్తయ్యాయి. ప్రస్తుతం కోనసీమ జిల్లాలో మలికిపురం మండలంలోని ఇరుసమండ గ్రామం వద్ద జరిగిన ఌఔఉఅ గ్యాస్ లీక్ గురించి అందరూ భయపడుతున్నారు. కానీ దీన్ని మించిన అత్యంత ప్రమాదం 30 ఏళ్ల క్రితమే జరిగింది. అమలాపురానికి 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాశర్లపూడి అనే గ్రామంలో ఌఔఉఅ గ్యాస్ డ్రిల్లింగ్ పనులు జరుపుతున్నప్పుడు ఒక్కసారిగా లీకేజ్ ఏర్పడి భారీ అగ్ని ప్రమాదం జరిగింది.

# ఇంజరి పంచాయతీ నిధుల గోల్‌మాల్‌పై ఆర్డీవో సీరియస్ విచారణ

**రికార్డులుక్షేత్రస్థాయి పనుల్లో పొంతన లేదని ప్రాథమికంగా నిర్ధారణ**

**బాధ్యులపై కఠిన చర్యలు తప్పవు : ఇంచార్జ్ ఆర్డీవో లోకేశ్వర రావు**

**సామాన్యుడి అస్త్రం అల్లూరి :** పెదబయలు మండలం ఇంజరి గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగం ఆరోపణలపై జిల్లా కలెక్టర్ శ్రీ ఎ.ఎస్. దినేష్ కుమార్ ఆదేశాల మేరకు అధికారిక విచారణ వేగవంతమైంది. ఈ మేరకు ఇంచార్జ్ ఆర్డీవో శ్రీ ఎం. లోకేశ్వర రావు బుధవారం పెదబయలు ఎంపీడీవో కార్యాలయంలో విచారణాధికారిగా హాజరై సమగ్రంగా విచారణ చేపట్టారు.దఇంజరి పంచాయతీకి సంబంధించిన నిధులు గత కొంతకాలంగా పక్కదారి పట్టాయన్న ఆరోపణలు, రికార్డుల్లో చూపిన అభివృద్ధి పనులకు క్షేత్రస్థాయిలో జరిగిన పనులకు మధ్య పొంతన లేకపోవడంపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఆర్డీవో లోతైన విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శితో పాటు సంబంధిత సిబ్బందిని పిలిపించి నిధుల వినియోగం, నగదు ఉపసంహరణ, బిల్లుల చెల్లింపులపై పూర్తి వివరాలు కోరారు. విచారణలో తేలిన అంశాలను సమగ్ర నివేదిక రూపంలో జిల్లా కలెక్టర్‌కు





సమర్పించనున్నట్లు ఆర్డీవో స్పష్టం చేశారు. పంచాయతీ నిధుల దుర్వినియోగానికి పాల్పడిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఇదే సందర్భంలో తదుపరి దశ విచారణలో భాగంగా 20222024 సంవత్సరాల మధ్య ఎం-బుక్‌ల ఆధారంగా చేపట్టిన పనుల వివరాలను పరిశీలించనున్నట్లు తెలిపారు. ఆ కాలంలో విధులు నిర్వహించిన అప్పటి జూనియర్ ఇంజనీర్లను కూడా విచారణకు హాజరుపరచనున్నట్లు పేర్కొన్నారు. పంచాయతీ నిధుల వ్యవహారంపై ఉన్నతాధికారులు నేరుగా రంగంలోకి దిగడంతో పెదబయలు మండలంలో ఈ అంశం రాజకీయ, పరిపాలనా వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

## జాతీయ బీసీ జనసేన కమిటీల ఎంపిక

**జాతీయ బిసి జనసేన అధ్యక్షులు కత్తి చంద్రశేఖరప్ప వెల్లడి**



**సామాన్యుడి అస్త్రం షాద్ నగర్ :** జాతీయ బిసి జనసేన అధ్యక్షులు కత్తి చంద్రశేఖరప్ప ఆధ్వర్యంలో అధికారికంగా పలువురిని పదవులలో నియమించినట్లు ఆయన ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా జాతీయ బీసీ జనసేన రంగారెడ్డి జిల్లా కన్వీనర్ గా మేకల వెంకటేష్ ముదిరాజ్, జిల్లా అధ్యక్షుడిగా బోయ చెన్నయ్య, ఉపాధ్యక్షులుగా మేళగొని నరసింహులు, జిల్లా మహిళా అధ్యక్షురాలిగా కాటామ్ భాగ్యలక్ష్మి గౌడ్, షాద్ నగర్ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలిగా జక్కుల జలజ, నియోజకవర్గ మహిళా ఉపాధ్యక్షురాలిగా అరుణ గౌడ్, నియోజకవర్గ అధ్యక్షుడు గా గడ్డమీది రమేష్, షాద్ నగర్ పట్టణ ఉపాధ్యక్షులుగా రాములు గౌడ్, జడ్చర్ల నియోజకవర్గ అధ్యక్షుడు గా వినయ్ కుమార్, నియోజకవర్గ అధికార మహిళా ప్రతినిధిగా స్రవంతి రాజ్ తదితరులను నియమించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా నియమించబడిన సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు..

## ఇందుకూరుపేట ఆర్ అండ్ అండ్ బి రోడ్డు పాడైపోతున్న దుస్థితి

**వీల్స్ ట్రాక్టర్ల వల్ల రోడ్డు మొత్తం గీతలు పడి రోడ్ పగిలింపు**

**పట్టించుకోని ఆర్ అండ్ బి అధికారులు**

**ఆర్ అండ్ బి అధికారులు నిర్లక్ష్యం కోట్లు రూపాయలు నిధులు పెట్టి వేసిన రోడ్డు నేలపాలు**



**సామాన్యుడు అస్త్రం దేవీపట్నం:** మండలం లో పోతవరం నుండి గోకవరం ఆర్ అండ్ బి రోడ్డు వీల్స్ ట్రాక్టర్లు తిరగడం వల్ల కోట్లు రూపాయలేట్టి వేసిన రోడ్డు నేలపాలవుతుంది. గత కొన్ని నెలలుగా ఆర్ అండ్ బి నిర్లక్ష్యం కారణంగా రోడ్ పాడైపోతున్నాయని వాహనా దారులు పత్రిక ముఖంగా తెలియజేశారు. ఆర్ అండ్ బి అధికారులు నిర్లక్ష్యం కారణంగా కోట్లు రూపాయలు నిధులుతో వేసిన ఇందుకూరుపేట గోకవరం రోడ్డు రోజురోజుకీ పాడైపోతుంది. గత వైసిపి పాలనల ఇందుకూరుపేట గోకవరం ఆర్ అండ్ బి రోడ్డు జరిగింది. రోడ్ వేసి సుమారు 5 సంవత్సరాల పూర్తి కాకుండానే ఆర్ అండ్ బి అధికారులు నిర్లక్ష్యం కారణంగా వీల్స్ ట్రాక్టర్లు నిత్యం తిరుగుతూ రోడ్లు పాడు చేస్తున్న సంబంధించిన అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వీల్స్ ట్రాక్టర్ల పైన చర్యలు తీసుకోవాలని పరువురు కోరుతున్నారు.....

## హుకుంపేట పంచాయతీలో వేగంగా పారిశుధ్య పనులు

**గ్రామ సౌందర్యమే లక్ష్యంగా ముందడుగు సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ**

**సామాన్యుడి అస్త్రం అల్లూరి :** అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలంలోని హుకుంపేట గ్రామ పంచాయతీలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పారిశుధ్య పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. గ్రామాలను పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ నేతృత్వంలో, పంచాయతీ అభివృద్ధి అధికారి సత్యనారాయణ ఆధ్వర్యంలో విస్తృత పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ మాట్లాడుతూ, ప్రతి గ్రామం పరిశుభ్రంగా ఉండాలంటే ప్రజల సహకారం అత్యంత అవసరమని పేర్కొన్నారు. పంచాయతీ ఆధ్వర్యంలో ప్రతిరోజూ పారిశుధ్య కార్మికుల ద్వారా చెత్త సేకరణ చేపడుతున్నప్పటికీ, కొందరు నిర్లక్ష్యంగా ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయడం వల్ల గ్రామాల్లో పారిశుధ్య లోపం తలెత్తుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ ప్రజలు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంలో పంచాయతీ సిబ్బందికి, క్లాప్ మిత్రలకు సహకరించాలని



ఆమె విజ్ఞప్తి చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా జీవించగలమని, పారిశుధ్యం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాల్సిన అవసరం ఉందని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రమాదేవి, సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ, పంచాయతీ అభివృద్ధి అధికారి సత్యనారాయణ, పేసా కమిటీ సభ్యులు మజ్జి రామకృష్ణ, సంధ్య తదితరులు పాల్గొని పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. గ్రామ అభివృద్ధికి ప్రజలు, పాలన వ్యవస్థ కలిసి పనిచేసినప్పుడే సంపూర్ణ ఫలితాలు సాధ్యమవుతాయని ఈ సందర్భంగా అధికారులు అభిప్రాయపడ్డారు.

## మీడియా లో గుర్తింపు ఉండదనే సీఎం రేవంత్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కే.టీ.ఆర్ లక్ష్మీనారాయణ నాయక్ (కాంగ్రెస్ నాయకులు)

**సామాన్యుడి అస్త్రం జనగామ** నిన్న జనగామ లో కేటీఆర్ సీఎం రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ పై అనుచిత వ్యాఖ్యలు చేసారని కాంగ్రెస్ కమిటీ డీసీసీ కార్యాలయంలో ఈ రోజు ముఖ్య నాయకులతో ప్రెస్ మీట్ ఏర్పాటు చేసారు ఈ సందర్భంగా పీసీసీ సభ్యుడు లక్ష్మీనారాయణ నాయక్ మాట్లాడుతూ తుపాకీ రాముడిలా కేటీఆర్ మాటలు తండ్రి పేరు చెప్పి నాయకుడిని అని చెప్పుకుంటున్నారన్నారు, అగ్ర నేత రాహుల్, సీఎం రేవంత్ రెడ్డి పై నిస్సిగ్గుగా కేటీఆర్ మాట్లాడరని అన్నారు, మీడియాలో తనకు గుర్తింపు ఉండదని ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడారని అసలు కేటీఆర్ కు జనగామ జిల్లాకు వచ్చే అర్హత ఉందా అని ప్రశ్నించారు, 11వ జిల్లాగా జనగామ చేస్తా అని చెప్పి మీ కుటుంబ పంచాయతీ మూలంగా జనగామ అస్తిత్వాన్ని దెబ్బతీసి చేర్యాల ప్రాంతాన్ని సిద్దిపేటలో కలిపారన్నారు,, అలాగే సర్పంచులను బిల్లులు ఇవ్వకపోవడం వల్ల ఆత్మహత్య లకు కారణమయ్యారు, అలాంటది నువ్వు సర్పంచులకు సన్మానం చేస్తావా? అని ప్రశ్నించారు, తమకు ఎక్కడ ఎలా మాట్లాడాలో సంస్కారం ఉందని, సోనియా నిర్ణయంతోనే తెలంగాణ వచ్చిందని, మీ నాయన కెసిఆర్ సోనియా కాళ్లు మొక్కింది



మర్చిపోయావా అని అడిగారు, కేటీర్ వాడిన బాష తనకు తప్ప ఎవరికీ సూట్ కావని, తాను ఎన్ని కుతంత్రాలు పన్నినవో తమ చెల్లి చెప్పిందని తెలిపారు,దానికి సమాధానం చెప్పు అని, మౌనం అంగీకారం అంటారు కేటీఆర్ సమాధానం చెప్పలేదు అంటే తన చెల్లి మాటలను అంగీకరించినట్లేనని, మూటలు కాదని తాను చేసిన అప్పుల పాపాల మూటలు అవి అని అన్నారు లక్ష్మినారాయణ నాయక్ మరోపక్క పల్లాకు కొనుడు అమ్ముడు తప్పితే ఏమైనా తెలుసా అని ప్రశ్నించారు ప్రతి దాన్ని కార్పొరేట్ చేశాడని, అక్రమంగా సంపాదించిన డబ్బులు ఇచ్చి సర్పంచులను కొనుకున్నారని, ఏడు సార్లు గెలిచిన ఎర్రబెల్లిని కారు ముందు ఉరికించినావని, పెయింటింగ్ వృత్తిని కించపరిచేలా విధంగా మాట్లాడారన్నారు.

## జనగామ అమ్మ క్యాంటీన్

**సామాన్యుడి అస్త్రం జనగామ** జనగామ పద్మశాలి కళ్యాణ మండపం నిర్మాణ కమిటీ అధ్యక్షులు కేఎల్ఎన్ స్వామి పుట్టినరోజు సందర్భంగా ఈరోజు జనగామ జిల్లా ఆసుపత్రిలో వైద్యం కోసం వచ్చిన ప్రజలకు మహా అన్న సమర్పణ కార్యక్రమాన్ని నిర్వహించి నిత్యవసర సరుకులు బియ్యం కూరగాయలు ఆర్థికంగా సహాయం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు ఈ సందర్భంగా జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్ ప్రధాన కార్యదర్శి వంగ భీమ్ రాజు మాట్లాడుతూ కె.ఎల్.ఎన్ స్వామి జనగామ అమ్మ ఫౌండేషన్ సేవాకార్యక్రమాలకు మరింత తనవంతు సహకారం అందిస్తానని మంచి కార్యక్రమానికి తన వంతు





భాగస్వాములు చేసిన జనగామ అమ్మ ఫౌండేషన్ టీంను అభినందించారు జనగామ అమ్మ ఫౌండేషన్ ఆలోచన ఆశయంలో భారత దేశంలో ఆకలి చావులు లేకుండా నియంత్రణ లక్ష్యంగా ప్రజలు యువత ప్రతి ఒక్కరూ సందర్భం ఏదైనా కానీ మీ గ్రామస్థాయి పట్టణ స్థాయి నియోజకవర్గస్థాయిలో ఒకే తాటిపైకి వచ్చి నిరుపేద కుటుంబాలకు నిరాశ్రయులకు అనాధలకు ఒక పూట ఆకలిని తీర్చాలని పిలుపునిచ్చారు ఈ సేవా కార్యక్రమంలోజనగామ అమ్మ ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ కొయ్యడ రవి, బింగి నర్సింలు, ఎండి యాకూబ్, కొయ్యడ విశ్వ, ఎండి అఫ్రోజ్, ఎండి మొహమ్మద్ పాషా, తదితరులు పాల్గొన్నారు

## సర్పంచ్లకు ఉప సర్పంచ్లకు ఆత్మీయ సమ్మేళనంలో కేటీఆర్



**సామాన్యుడి అస్త్రం అశ్వరావుపేట :** జిల్లాలో జరిగిన టిఆర్ఎస్ సర్పంచ్లకు, ఉప సర్పంచ్లకు ఆత్మీయ సమ్మేళనంలో మాజి మంత్రివర్యులు కల్వకుంట్ల రామారావని మర్యాదపూర్వకంగా కలిసి మాజీ ఎమ్మెల్యే:తాటి వెంకటేశ్వర్లుమాజీ మంత్రివర్యులు కల్వకుంట్ల తారక రామారావుని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందచేసినందుకు చాలా సంతోషం! ఈ కార్యక్రమంలో మాజీ పార్లమెంట్ సభ్యులు నామా నాగేశ్వరరావు, పువ్వాడ అజయ్, జిల్లా ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ఏసీబీ వలలో నందిగామ ఎంపీడీవో సుమతి..

**ఎంపీవో తేజ్ సింగ్, ఈదులపల్లి కార్యదర్శి చెన్నయ్య..**

**లక్ష రూపాయలు లంచం తీసుకుంటూ అడ్డంగా బుక్ అయిన అధికారులు..**



**సామాన్యుడి అస్త్రం న్యూస్ షాద్ నగర్ :**రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం ఈదులపల్లి గ్రామ వ్యవసాయ క్షేత్రంలో ఓ భవన నిర్మాణానికి అనుమతి కోసం ఓ వ్యక్తి దరఖాస్తు చేసుకోవడంతో గ్రామపంచాయతీ కార్యదర్శి చెన్నయ్య ,ఎంపీఓ తేజ్ సింగ్, ఎంపీడీవో సుమతి, ముగ్గురి సమక్షంలో మొట్ట మొదట ఐదు లక్షల రూపాయలు లంచం డిమాండ్ చేశారు రెండున్నర లక్షలకు డీల్ కుదుర్చుకోగా ముందే లక్ష యాభై వేల రూపాయలు అడ్వాన్స్ గా తీసుకున్నారు మిగతా లక్ష రూపాయలు బుధవారం నాడు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా రంగారెడ్డి జిల్లా ఏసీబీ డిఎస్పి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో అధికారులు సాక్షాత్తు నందిగామ ఎంపీడీవో కార్యాలయంలోనే లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు..

## చెక్కు ను అందజేసిన కొమ్మ వెంకటరమణ



**సామాన్యుడి అస్త్రం** కొండపాక మండల కేంద్రంలో నిరుపేద దళిత కుటుంబానికి చెందిన ఆరుట్ల రాజయ్యకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వచ్చిన 18000 రూ,, చెక్కును వార్డ్ మెంబర్ కొమ్ము వెంకటరమణ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు ముఖ్యమంత్రి సహాయ నిధిని పార్టీలకతీతంగా అందరూ వినియోగించుకోవాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో మాజీ ఆత్మ కమిటీ డైరెక్టర్ ఆరుట్ల కనకరాజు, దీ=వా సీనియర్ నాయకులు మునిగడప మురళి , నాయకులు నాయకులు జాలిగామ రాజు ,ఆరుట్ల శేఖర్, ఆరుట్ల పవన్ ,జలిగమ నర్సింలు , కిషన్,వేముల నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మకు అక్షరమాలపై అవగాహన కార్యక్రమం

**జమ్మికుంటలో మెప్మా ఆధ్వర్యంలో అవగాహన**



**సామాన్యుడి అస్త్రం** హుజురాబాద్ నియోజకవర్గం, జమ్మికుంట అమ్మకు అక్షరమాల కార్యక్రమంలో భాగంగా ఆర్పీలు, ఓబీలకు జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని పాత మున్సిపల్ కార్యాలయంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ మేనేజర్ జి. రాజిరెడ్డి హాజరయ్యారు. మెప్మా టీఎంసీ మల్లీశ్వరి, సీఆర్పీలు అరుణ, శోభారాణి తదితరులు పాల్గొని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణాల్లో అక్షరాస్యతను పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. అక్షరాస్యత కార్యక్రమంలో ప్రతి ఒక్కరికి చదువు ఎలా నేర్పించాలి అనే అంశంపై స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. విజ్ఞానం, వివేకం ద్వారా నవసమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. మహిళలు చదువుకుంటే ప్రతి ఇల్లు చదువుకున్నట్టేనని పేర్కొన్నారు. అక్షరాస్యత, ప్రాథమిక విద్య ప్రతి వ్యక్తి జీవితంలో అత్యంత కీలకమని, ఇవి ఉంటేనే ఆధునిక సమాజంలో సుఖంగా జీవించగలమన్నారు. వివిధ కారణాల వల్ల చదువు మానేసిన 15 సంవత్సరాలు పైబడిన వయోజనులు ఈ కార్యక్రమం ద్వారా అక్షరాస్యతతో పాటు కీలక జీవన నైపుణ్యాలు కూడా నేర్చుకుంటారని తెలిపారు. చదువు పూర్తిచేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తామని, తద్వారా వారు పై చదువులు కొనసాగించే అవకాశం ఉంటుందన్నారు. “వయసు దాటిపోయింది, ఇప్పుడు చదువు అవసరమా?” అని అనుకునేవారికి ఏ వయసులోనైనా చదువు నేర్చుకోవచ్చని, అది మనం వారికి చెప్పే విధానంపై ఆధారపడి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సి.ఎల్.ఆర్పీలు జ్యోతి, మంజుల, ఇతర ఆర్పీలు, ఓబీలు తదితరులు పాల్గొన్నారు




**జిన్నారంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ జయప్రకాశ్ నారాయణపై తీవ్ర ఆరోపణలు**

**ఉక్కుపాదం పేరుతో వసూళ్ల ఆరోపణలు**

**వీడియోతో బహిర్గతమైన వ్యవహారం**

**చిన్నవాళ్లపై కఠినత్వం పెద్ద అక్రమాలపై మౌనం**

**అసైన్డ్ భూములపై అనుమానాల నీడ**

**స్వతంత్ర విచారణకు డిమాండ్**

# ఉక్కుపాదం మాటలే.. లోపల వసూళ్ల దందా?

అస్త్రం నిఘావిభాగం, సంగారెడ్డి జిల్లా :

అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపుతున్నామని బహిరంగంగా ప్రకటిస్తూ, అదే సమయంలో వెనుకపోటుగా పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నాడన్న ఆరోపణలతో జిన్నారం మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ జయప్రకాశ్ నారాయణపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలంలోని గడ్డపోతారం అల్లినగరు సర్వే నెంబర్27లో విచ్చలవిడిగా జరుగుతున్న అక్రమ నిర్మాణాలే ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణగా స్థానికులు చూపిస్తున్నారు. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన అధికారే వాటిని ప్రోత్సహిస్తూ, నిర్మాణాలు చేపట్టే వ్యక్తుల వద్ద నుంచి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నట్లు వీడియో బయటికి రావడంతో ఈ వ్యవహారం బహిర్గతమైంది. నిజాయితీగా విధులు నిర్వహిస్తున్నామని చెప్పుకుంటూ, లోపల మాత్రం అక్రమాలకు అండగా నిలుస్తున్నాడన్న ఆరోపణలు ఇప్పుడు బలంగా వినిపిస్తున్నాయి. స్థానికుల కథనం ప్రకారం, ఒక సామాన్య వ్యక్తి చిన్నగా ఇంటి నిర్మాణం చేపడితే మాత్రం రెవెన్యూ అధికారులు ఆగమేఘాల మీద అక్కడికి చేరుకుని, “క్రిమినల్ కేసు పెడతాం” అంటూ బెదిరింపులకు పాల్పడి నిర్మాణాలను కూల్చివేయడం తరచూ జరుగుతోంది. అదే సమయంలో పెద్ద ఎత్తున, కోట్ల విలువైన అక్రమ నిర్మాణాల విషయంలో మాత్రం అధికారులు మౌనం పాటించడం వెనుక భారీ వసూళ్లే కారణమన్న ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా జిన్నారం మండలంలో ఉన్న అసైన్డ్ ల్యాండ్స్ విషయంలో జయప్రకాశ్ నారాయణ పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అసైన్డ్ భూముల్లో నిర్మాణాలు, లేఅవుట్లు, అక్రమ విక్రయాలు జరుగుతున్నా, రెవెన్యూ శాఖ నుంచి ఎలాంటి కఠిన చర్యలు లేకపోవడం వెనుక “సెట్టింగ్స్” ఉన్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అసైన్డ్ భూములను రక్షించాల్సిన అధికారే వాటి దోపిడీకి మౌన మద్దతు ఇస్తున్నాడన్న ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయి. జిన్నారం మండల రెవెన్యూ కార్యాలయంలో “అంతా నేనే” అన్న ధోరణితో జయప్రకాశ్ నారాయణ వ్యవహరిస్తున్నాడని పలువురు ఆరోపిస్తున్నారు. చాలా రోజులుగా ఈ వసూళ్ల తతంగం కొనసాగుతున్నప్పటికీ, పై అధికారుల దృష్టికి వెళ్లకపోవడం లేదా వెళ్లినా పట్టించుకోకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. జిన్నారం తహసీల్దార్ దేవదాస్ పరిధిలో పనిచేస్తున్న ఈ అధికారిపై గతంలోనే అనేక ఫిర్యాదులు నమోదయ్యాయని సమాచారం. గత ఐదేళ్లుగా జిన్నారం మండలంలోనే విధులు నిర్వహిస్తూ, విస్తృత పరిచయాలు పెంచుకున్నాడని, అదే తనకు రక్షణగా మారిందన్న ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం మండలంలో “ఇతను ఆడిందే ఆట, పాడిందే పాట” అన్న స్థాయికి పరిస్థితి చేరిందని ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు. జయప్రకాశ్ నారాయణ నివాసం హైదరాబాద్‌లో ఉండటంతో, అక్కడి నుంచి తన ప్రభావాన్ని ఉపయోగించి వ్యవహారాలు నడుపుతున్నాడన్న ఆరోపణలూ వినిపిస్తున్నాయి. ఈ మొత్తం వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి స్వతంత్ర విచారణ చేపట్టి, ఆరోపణలు నిజమైతే కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## జిన్నారం మండల ప్రజల స్పందన

జిన్నారం మండలంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ జయప్రకాశ్ నారాయణపై వస్తున్న ఆరోపణలపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. “చిన్నవాళ్లపై మాత్రం చట్టం ఉక్కుపాదంలా పనిచేస్తోందిడ పెద్ద అక్రమాల వద్దకు వస్తే ఎందుకు మౌనం?” అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అసైన్డ్ భూముల రక్షణలో రెవెన్యూ శాఖ పూర్తిగా విఫలమైందని, అధికారులుదళారుల మధ్య కుమ్మక్కు ఉందన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్ స్థాయి విచారణ జరిపి, క్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకపోతే ఉద్యమాలకు సిద్ధమవుతామని కొంతమంది హెచ్చరిస్తున్నారు.


## జిన్నారం తహసీల్దార్ స్పందన

జిన్నారం మండలంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ జయప్రకాశ్ నారాయణపై వస్తున్న అక్రమ నిర్మాణాలు, వసూళ్లు, అసైన్డ్ భూముల వ్యవహారాల ఆరోపణలపై జిన్నారం తహసీల్దార్ దేవదాస్ స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “రెవెన్యూ ఇన్స్పెక్టర్‌పై వస్తున్న ఆరోపణలపై ఇప్పటికే మా దృష్టికి సమాచారం వచ్చింది. అక్రమ నిర్మాణాలు, అసైన్డ్ ల్యాండ్స్ విషయంలో ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు. సంబంధిత విషయాలపై పూర్తి స్థాయి నివేదిక సిద్ధం చేసి పై అధికారులకు పంపిస్తాం. ఆరోపణలు నిజమైతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం” అని తెలిపారు. అయితే స్థానికుల మాట ప్రకారం, గతంలో కూడా ఇలాంటి ఫిర్యాదులు వచ్చినప్పటికీ ఇప్పటివరకు స్పష్టమైన చర్యలు కనిపించలేదని, ఈసారి అయినా విచారణ కాగితాలకే పరిమితం కాకుండా వాస్తవ చర్యలుగా మారాలని కోరుతున్నారు. ముఖ్యంగా అసైన్డ్ భూముల పరిరక్షణ విషయంలో రెవెన్యూ యంత్రాంగం పూర్తిగా బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తున్నారు.











## పొంగల్ పోటీ.. పరాశక్తి కొత్త రిలీజ్ డేట్

సంక్రాంతి సినిమాల పోటీ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఏడాది ముందుగానే కర్చీఫ్ వేయాల్సిందే. పొంగల్ బాక్సాఫీస్‌కు తెలుగు రాష్ట్రాల్లో విపరీతమైన క్రేజ్ ఉంది. అందుకే స్టార్స్ అంతా సంక్రాంతి రిలీజ్‌కు సిద్ధంగా ఉంటారు. ఇప్పటికే టాలీవుడ్ నుంచి వచ్చే ఏడాది సంక్రాంతికి సినిమాల డేట్స్ ఖరారయ్యాయి. వీటిలో ది రాజాసాబ్ జనవరి 9న, మనశంకరవరప్రసాద్ గారు జనవరి 12న, భర్త మహాశయులకు విజ్ఞప్తి జనవరి 13న, నారీ నారీ నడుమ మురారి, అనగనగా ఒక రాజు జనవరి 14న థియేటర్లలో సందడి చేయనున్నాయి. వీటికి తోడు కోలీవుడ్ సినిమాలు సైతం సంక్రాంతి బాక్సాఫీస్ బరిలో నిలిచాయి. అయితే కోలీవుడ్ స్టార్ శివ కార్తికేయన్, శ్రీలీల నటించిన పరాశక్తి కూడా పొంగల్‌కే రానుంది. ఇప్పటికే ఈ మూవీ రిలీజ్ తేదీని కూడా ప్రకటించారు. జనవరి 14న విడుదల చేస్తామని ఫిక్సయ్యారు. అయితే తాజాగా రిలీజ్ తేదీ విషయంలో బిగ్ ట్విస్ట్ ఇచ్చారు మేకర్స్. జనవరి 10న టాలీవుడ్ సినిమాలేవీ రిలీజ్ లేకపోవడంతో ఆ రోజే పరాశక్తి విడుదల కానుందని ప్రకటించారు. దీంతో ది రాజాసాబ్ రిలీజైన మరుసటి రోజే పరాశక్తి థియేటర్లకు రానుంది. విపరీతమైన పోటీ ఉన్న పొంగల్ బాక్సాఫీస్ వద్ద పరాశక్తికి థియేటర్లు ఎంతవరకు దొరుకుతాయో అన్నది ప్రశ్నార్థకంగా మారింది. మరోవైపు కోలీవుడ్ బాక్సాఫీస్ వద్ద ఆసక్తికర పోటీ నెలకొంది. హెచ్.వినోద్ దర్శకత్వంలో విజయ్ నటిస్తున్న దళపతి విజయ్ జన నాయగన్ జనవరి 9న విడుదల కానుంది. కాగా.. ఈ సినిమాకు సుధా కొంగర దర్శకత్వం వహించారు

## బాలకృష్ణ-బోయపాటి కాంబోలో తొలి ఫ్లాప్ ఎన్బీకే 111 ప్రాజెక్ట్‌పై ప్రభావం

టాలీవుడ్ స్టార్ హీరో బాలకృష్ణ చివరగా 'అఖండ 2' చిత్రంతో ప్రేక్షకులని పలకరించిన విషయం తెలిసిందే. ఈ సినిమా బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కగా, డిసెంబర్ 12న విడుదలైంది. బాలయ్య-బోయపాటి కాంబోతో గతంలో వచ్చిన 'సింహా', 'లెజెండ్', 'అఖండ' చిత్రాలు వరుస హిట్లు కొట్టగా, ఈసారి హ్యాట్రిక్ విఫలమైందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. సినిమా విడుదలైన తొలి రోజు నుంచి మూవీ నెగటివ్ టాక్ ఎదుర్కొంది. భారీ బడ్జెట్‌తో నిర్మితమైనప్పటికీ, ఫలితంగా రెండు కోట్లకుపైగా నష్టాలు రికార్డ్ అయ్యాయని సమాచారం. మొత్తం వ్యాపారం రూ.103 కోట్లు ఊహించినప్పటికీ, గ్రాస్ కలెక్షన్స్ సుమారు రూ.120 కోట్లు, షేర్ వసూలు రూ.70 కోట్లు మాత్రమే. దీని ప్రభావంతో బయ్యర్లు ఇప్పుడు దర్శకుడు బోయపాటిపై కాస్త ఆగ్రహంతో ఉన్నట్టు తెలుస్తుంది. 'అఖండ 2' ఫలితం బాలయ్య తదుపరి సినిమాపై తీవ్ర ప్రభావం చూపుతోంది. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో రూపొందుతున్న ఎన్బీకే 111 ప్రాజెక్ట్ హోల్డ్‌లో ఉంది. ఈ సినిమా పీరియాడికల్, హిస్టారికల్ యాక్షన్ కాన్సెప్ట్‌తో, బాలయ్య ద్విపాత్రాభినయం చేస్తారని ప్రచారం. ఒక పాత్రలో రాజుగా, మరొక పాత్రలో యోధుడిగా కనిపించనున్నారు. అయితే 'అఖండ 2' పరాజయం కారణంగా సినిమా బడ్జెట్ తగ్గింపు, స్క్రిప్ట్ మార్పులు చేయడం ప్రారంభమైందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నారు. పీరియడ్, హిస్టరీ ఎపిసోడ్స్‌ని తగ్గించి, రెగ్యులర్ కమర్షియల్ మూవీలా మార్చే దిశలో పని జరుగుతోందని తెలుస్తోంది. కథ ఫైనల్‌గా పూర్తైతే సినిమా షూటింగ్ కొనసాగుతుందని, లేదంటే ప్రాజెక్ట్ రద్దు అయ్యే అవకాశం కూడా ఉందని సమాచారం. బాలయ్య, గోపీచంద్ మలినేని కాంబోలో చివరగా వచ్చిన 'వీర సింహారెడ్డి' సక్సెస్ తర్వాత, 'ఎన్బీకే 111' కోసం భారీ ప్రణాళికలు రూపొందించినట్లు తెలుస్తోంది.



## ఇద్దరు పిల్లల తల్లిని.. ఈ జనరేషన్‌కు నచ్చకపోవచ్చు!

తక్కువకాలంలో స్టార్‌డమ్ సంపాదించుకున్న హీరోయిన్లలో శ్రీలీల ఒకరు. క్యూట్ ఫేస్‌తో, అమాయకపు చిరునవ్వుతో అందరినీ బుట్టలో వేసుకున్న ఈ బ్యూటీ టాలీవుడ్, కోలీవుడ్, బాలీవుడ్ అని తేడా లేకుండా అంతటా సినిమాలు చేస్తోంది. ప్రస్తుతం ఆమె హీరోయిన్‌గా నటించిన 'పరాశక్తి' మూవీ సంక్రాంతి పండక్కి (జనవరి 10న) విడుదలవుతోంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఓ తమిళ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఓ ఆసక్తికర విషయాన్ని చెప్పుకొచ్చింది. తను ఇద్దరు చిన్నారులను దత్తత తీసుకున్న విషయం గురించి తొలిసారి స్పందించింది. శ్రీలీల మాట్లాడుతూ.. పిల్లల ప్రస్తావన వస్తే నాకు మాటలు రావు. వాళ్లు నాతో ఉంటే బాగుండేదనిపిస్తుంది. నాతో కలిసుండకపోయినా నేను వారిని బాగా చూసుకుంటున్నాను. కిస్ (2019) అనే కన్నడ మూవీ సమయంలో దర్శకుడు నన్ను ఓ ఆశ్రమానికి తీసుకెళ్లాడు. అక్కడే ఈ పిల్లలు ఉండేవారు. మేము ఫోన్‌లో మాట్లాడేవాళ్లం. వీలు దొరికినప్పుడల్లా అక్కడికి వెళ్లేదాన్ని. కానీ, ఈ విషయాన్ని నేను చాలాకాలం రహస్యంగా ఉంచాను. అయితే ఆ ఆశ్రమం వాళ్లు దీన్ని గోప్యంగా ఉంచడం దేనికి? మీరు బయటకు చెప్తేనే మిమ్మల్ని చూసి ఇంకో నలుగురైనా ముందుకొస్తారు అన్నారు. నిజమే కదా అనిపించింది. నేనేదో గొప్ప చేశానని చెప్పడం లేదు కానీ జనాలు కూడా ఆ దిశగా ఆలోచిస్తే బాగుంటుంది. అయితే ఈ జనరేషన్‌కు నాలాంటివాళ్లు నచ్చకపోవచ్చు. నేను మంచి గర్ల్‌ఫ్రెండ్ కాకపోవచ్చేమో! అయినా సరే.. నా తల్లి నన్నెంతగా ప్రేమిస్తుందో.. అదే ప్రేమను ఆ పిల్లలకు పంచుతున్నాను అని చెప్పుకొచ్చింది. కాగా శ్రీలీల 2022లో గురు, శోభిత అని ఇద్దరు దివ్యాంగులను దత్తత తీసుకుంది. 2025లో తన బర్త్‌డేకు ముందు ఓ పసిపాపను దత్తత తీసుకున్నట్లు ప్రచారం జరిగింది. కానీ ఆ చిన్నారి తన మేనకోడలు అని శ్రీలీల క్లారిటీ ఇచ్చింది.



# టీ20 ప్రపంచకప్ 2026కు న్యూజిలాండ్ జట్టు ప్రకటన

ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న టీ20 ప్రపంచకప్ కోసం 15 మంది సభ్యుల న్యూజిలాండ్ జట్టును ఇవాళ (జనవరి 7) ప్రకటించారు. ఈ జట్టుకు కెప్టెన్‌గా మిచెల్ సాంట్నర్ ఎంపికయ్యాడు. ఉపఖండపు పరిస్థితుల దృష్ట్యా న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు స్పిన్ హెవీ టీమ్‌ను ఎంపిక చేసింది. జట్టులో నలుగురు స్పిన్నర్లకు (సాంట్నర్, బ్రేస్‌వెల్, ఫిలిప్స్, రచిన్) అవకాశం కల్పించింది. ఆర్సీబీ స్టార్ బౌలర్, గతేడాది లీడింగ్ వికెట్ టేకర్ జేకబ్ డఫీ తొలిసారి ప్రపంచకప్ జట్టులో చోటు దక్కించుకున్నాడు. కైల్ జేమీసన్ ట్రావెలింగ్ రిజర్వ్‌గా ఎంపికయ్యాడు. ఆడమ్ మిల్నే, జేమ్స్ నీషమ్ తమ స్థానాలను నిలబెట్టుకున్నారు. లాకీ ఫెర్గూసన్, మ్యాట్ హెన్రీ పితృత్వ సెలవుల కారణంగా కొన్ని మ్యాచ్‌లు మిస్ అవుతారు. వీరిద్దరు గాయాల నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారు.
ఈ జట్టుకు ఎంపికైన మరో ముగ్గురు (ఫిన్ అలెన్, మార్క్ చాప్‌మన్, సాంట్నర్) కూడా గాయాల నుంచి కోలుకునే క్రమంలో ఉన్నారు. కాగా, ప్రపంచకప్‌లో న్యూజిలాండ్, ఆఫ్ఘనిస్తాన్, కెనడా, సౌతాఫ్రికా, యూఏఈ గ్రూప్-డిలో ఉన్నాయి. న్యూజిలాండ్ తమ తొలి మ్యాచ్‌ను ఫిబ్రవరి 8న చెన్నైలో ఆఫ్ఘనిస్తాన్‌తో ఆడుతుంది. దీనికి ముందు న్యూజిలాండ్ భారత్‌తో పరిమిత ఓవర్ల సిరీస్‌లు ఆడుతుంది.



ఈ సిరీస్‌ల్లో భాగంగా జనవరి 11 నుంచి మూడు వన్డేలు జరుగుతాయి. తొలి వన్డే వడోదరలో.. రెండో వన్డే రాజ్‌కోట్‌లో (జనవరి 14), మూడో వన్డే ఇండోర్‌లో (జనవరి 18) జరుగనున్నాయి. అనంతరం జనవరి 21 నుంచి ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ప్రారంభమవుతుంది. జనవరి 21, 23, 25, 28, 31 తేదీల్లో నాగ్‌పూర్, రాయ్‌పూర్, గౌహతి, వైజాగ్, తిరువనంతపురం వేదికలుగా టీ20లు జరుగనున్నాయి. ఈ సిరీస్ కోసం ఎంపిక చేసిన జట్టులో నలుగురిని మార్చి ప్రపంచకప్ జట్టును ఎంపిక చేసింది.

**టీ20 ప్రపంచకప్‌కు న్యూజిలాండ్ జట్టు**

- మిచెల్ సాంట్నర్ (కెప్టెన్)
- ఫిన్ అలెన్
- మైఖేల్ బ్రేస్‌వెల్
- మార్క్ చాప్‌మన్
- డెవాన్ కాన్వే
- జేకబ్ డఫీ
- లాకీ ఫెర్గుసన్
- మ్యాట్ హెన్రీ
- డారిల్ మిచెల్
- ఆడమ్ మిల్నే
- జేమ్స్ నీషమ్
- గ్లెన్ ఫిలిప్స్
- చిన్ రవీంద్ర
- టిమ్ సీఫర్ట్
- ఇష్ సోధీ

ట్రావెలింగ్ రిజర్వ్: కైల్ జేమిసన్

## తొలి శతకంతోనే చరిత్రపుటల్లోకెక్కిన ఇంగ్లండ్ యువ ఆటగాడు



సిడ్నీ వేదికగా జరుగుతున్న యాషెస్ చివరి టెస్ట్ రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ యువ ఆటగాడు జేకబ్ బేతెల్ సెంచరీతో కదంతొక్కాడు. 22 ఏళ్ల బేతెల్‌కు టెస్ట్‌ల్లో ఇది తొలి శతకం. ఈ శతకంతో అతడు రికార్డుపుటల్లోకెక్కాడు. ఆస్ట్రేలియాపై 22 ఏళ్లలోపు శతకం చేసిన తొమ్మిదో ఇంగ్లండ్ బ్యాటర్ అయ్యాడు. ఈ జాబితాలో జానీ బ్రిగ్స్, జాక్ హెర్న్, పటౌడి, కాలిన్ కౌడ్రే, డేవిడ్ గోవర్, మైక్ అథర్టన్, అలిస్టర్ కుక్, బెన్ స్టోక్స్ ఉన్నారు. మ్యాచ్ విషయానికొస్తే.. బేతెల్ తన అద్భుత శతకంతో ఇంగ్లండ్‌ను ఆధిక్యం దిశగా నడిపించాడు. 99 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద ఏడు డాట్ బాల్స్ ఆడిన బేతెల్ వెబ్‌స్టర్ బౌలింగ్‌లో బౌండరీ కొట్టి సెంచరీ పూర్తి చేశాడు (162 బంతుల్లో). బేతెల్ సెంచరీ చేసిన అనంతరం అక్కడే మైదానంలో ఉన్న అతని కుటుంబ సభ్యులు తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. నాలుగో రోజు చివరి సెషన్ సమయానికి బేతెల్ 131 పరుగుల వద్ద ఇన్నింగ్స్ కొనసాగిస్తున్నాడు. అతనికి జతగా బ్రైడన్ కార్స్ (11) క్రీజ్‌లో ఉన్నాడు. ప్రస్తుతం ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 7 వికెట్ల నష్టానికి 290 పరుగులు చేసి పోరాడుతుంది. బేతెల్ పుణ్యమా అని ఆ జట్టు 107 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతుంది. ఈ ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌లో బేతెల్ మినహా ఎవరూ పెద్ద స్కోర్లు చేయలేదు. డకెట్, బ్రూక్ తలో 42 పరుగులు చేయగా.. జేమీ స్మిత్ 26, జాక్ క్రాలే 1, రూట్ 6, స్టోక్స్ 1, విల్ జాక్స్ డకౌటయ్యారు. ఆసీస్ బౌలర్లలో వెబ్‌స్టర్ 3 వికెట్లు పడగొట్టగా.. స్టార్క్, బోలాండ్, నెసర్ తలో వికెట్ తీశారు. అంతకుముందు హెడ్ (163), స్టీవ్ స్మిత్ (138) సెంచరీలతో కదంతొక్కడంతో ఆసీస్-తొలి ఇన్నింగ్స్‌లో 567 పరుగుల భారీ స్కోర్ చేసింది. మిగతా బ్యాటరల్లో వెబ్‌స్టర్ 71 (నాటౌట్), వెదర్లాడ్ 21, లబూషేన్ 48, మైఖేల్ నెసర్ 24, కెరీర్‌లో చివరి మ్యాచ్ ఆడుతున్న ఉస్మాన్ ఖ్వాజా 17, అలెక్స్ క్యారీ 16, గ్రీన్ 37 , స్టార్క్ 5, బోలాండ్ డకౌయ్యారు. ఇంగ్లండ్ బౌలర్లలో కార్స్, టంగ్ తలో 3, స్టోక్స్ 2, జాక్స్, బేతెల్ తలో వికెట్ తీశారు. దీనికి ముందు జో రూట్ (160) సెంచరీతో సత్తా చాటడంతో ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 384 పరుగులు చేసింది. హ్యారీ బ్రూక్ (84) అర్ధ సెంచరీతో రాణించాడు. ఆసీస్ బౌలర్లలో నెసర్ 4, స్టార్క్, బోలాండ్ తలో 2, గ్రీన్, లబూషేన్ చెరో వికెట్ తీశారు. కాగా,ఐదు మ్యాచ్‌ల ఈ సిరీస్‌ను ఆసీస్ ఇదివరకే 3-1 తేడాతో కైవసం చేసుకున్న విషయం తెలిసిందే.

## స్పోర్ట్స్

## వేదిక మార్పుపై బంగ్లాదేశ్ అభ్యర్థనను తిరస్కరించిన ఐసీసీ



ముంబై: టీ20 వరల్డ్‌కప్ లో భాగంగా భారత్‌లో జరిగే మ్యాచ్‌లకు చెందిన వేదికలను శ్రీలంకకు మార్చాలని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు చేసిన అభ్యర్థనను అంతర్జాతీయ క్రికెట్ మండలి తిరస్కరించినట్లు తెలుస్తోంది. ఈ అంశంపై ఐసీసీ, బీసీబీ మధ్య వర్చువల్ కాల్ జరిగింది. బంగ్లాదేశ్ చేసిన విన్నపాన్ని తిరస్కరించిన విషయం గురించి బోర్డుకు చెప్పినట్లు ఐసీసీ పేర్కొన్నది. వరల్డ్‌కప్‌లో ఆడాలంటే భారత్‌కు పర్యటించాల్సిందే అని, లేదంటే కీలకమైన పాయింట్లను కోల్పోతారని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డుకు ఐసీసీ చెప్పినట్లు తెలుస్తోంది. అయితే దీనికి సంబంధించిన అధికారిక సమాచారం లేదు. వరల్డ్‌కప్‌లో బంగ్లాదేశ్ తన తొలి మ్యాచ్‌ను ఫిబ్రవరి 7వ తేదీన వెస్టిండీస్‌తో ఆడనున్నది. ఆ మ్యాచ్ కోల్‌కతాలో జరగాల్సి ఉన్నది. ఆ తర్వాత ఇంగ్లండ్, నేపాల్‌తో ఆడనున్నది. భద్రతా దృష్ట్యా భారత్‌లో పర్యటించమని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు చెప్పింది. ఇటీవల బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడి ఘటనలు పెరిగిన నేపథ్యంలో రెండు దేశాల మధ్య క్రికెట్ సంబంధాలు బలహీనపడ్డాయి. హిందువుల హత్యలను నిరసిస్తూ ఐపీఎల్ నుంచి బంగ్లా పేసర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్ ను తొలగించారు. దీంతో సమస్య మరింత జటిలమైంది.

PRINTED AND PUBLISHED BY PANUTULA PRIYANKA, ON BEHALF OF PANUTULA PRIYANKA, PRINTED AT M/S.PARAHUSHAR PRINTING PUBLICATION, 1-4-36, SRINAGAR COLONY, MAHABUBABAD, WARANGAL TELANGANA -506101.AND PUBLISHED AT #H.NO.12-155, RAVINDER REDDY COMPLEX, NEAR HANUMANTEMPLE, IDA BOLLARAM MUNICIPALITY, JINNARAM MANDAL, SANGAREDDY DIST - 502325, TELANGANA STATE. EDITOR: PANUTULA PRIYANKA. RNI NO: TGTEL/25/A1872, Email: mathrubhoomiceo@gmail.com, Phone: 9182698313.